FOR ADS......
ఆకాంక్ష
CONTACT: 8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష TGTEL/25/A1964 akankshanews.com తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :207 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ శనివారం- 21 - మార్చి - 2026

## ఏపీ మద్యం కేసు.. ముప్పిడి అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు



ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్ లో ఉన్న ఆయనను ఇప్పటికే సిట్ మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఈ విచారణలో ఆయన పలు విషయాలను వెల్లడించినట్టు సమాచారం. ఈ కేసులో ముప్పిడి అవినాశ్ రెడ్డి నగదు బదిలీలు, ఆర్థిక నియంత్రణలో కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. మిగతా..2లో

## అంతా బోగస్... తెలంగాణ బడ్జెట్‌పై స్పందించిన హరీశ్ రావు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు.

బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు.

ఢిల్లి : బడ్జెట్‌పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు. అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు. అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదని అన్నారు. మిగతా..2లో

## బీఆర్ఎస్ లాగా చేసి ఉంటే బడ్జెట్ రూ.3,30 కోట్లు దాటేది..



2

- తెలంగాణ బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని, ఉద్యోగులకు రూ.కోటి బీమా కల్పిస్తూ వాస్తవ అంచనాలతో బడ్జెట్ రూపొందించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.
- రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి వివక్ష లేకుండా బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు.

హైదరాబాద్ : మాది పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్ అని ప్రజలే కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టామని

## ఇకపై టెన్త్ పరీక్షలు ఉండవు.. విద్యావిధానంపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- రాష్ట్ర విద్యావిధానంలో కీలక మార్పులు చేయబోతున్నామని, పదో తరగతి పరీక్షలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.
- మాది వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ బడ్జెట్ అని అన్న సీఎం బడ్జెట్‌కు వ్యతిరేకంగా చెవిలో పువ్వులు పెట్టుకుని అసెంబ్లీ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరుపై సీఎం సెటైర్లు వేశారు.
- విద్యావ్యవస్థలో మార్పులపై కమిటీ అధ్యయనం చేస్తోందని, విద్యావ్యవస్థలో మార్పులపై ఎడ్యుకేషన్ కమిషన్ నివేదికే ఫైనల్ కాదన్నారు

హైదరాబాద్: విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకురాబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో +2 విధానం అమలులో ఉందని, జాతీయ స్థాయి అధ్యనం తర్వాత రాష్ట్రంలోను విద్యావ్యవస్థలో మార్పులు చేయబోతున్నామని చెప్పారు. ఇకపై ూాజ బోర్డు లేనట్టేనని పదోతరగతి పరీక్షలు ఉండబోవన్నారు. ఇవాళ మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. విద్యావ్యవస్థలో మార్పులపై కమిటీ అధ్యయనం చేస్తోందని, విద్యావ్యవస్థలో మార్పులపై ఎడ్యుకేషన్ కమిషన్ నివేదికే ఫైనల్ కాదన్నారు. మాది వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ బడ్జెట్ అని అన్న సీఎం బడ్జెట్‌కు వ్యతిరేకంగా చెవిలో పువ్వులు పెట్టుకుని అసెంబ్లీ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరుపై సీఎం సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ నేతల చెవిలో పువ్వులు కాదు వంగబెట్టి వీపుపై బండలు కట్టాలన్నారు. కేసీఆర్ బయటకి రాకుండా గృహ నిర్బంధం చేశారని, తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. మిగతా..2లో


## అంకెల ఆర్భాటాలు.. కేటాయింపుల ప్రగల్భాలే

- తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.
- అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగిందేమీ లేదని వ్యాఖ్యలు చేశారు.



హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బడ్జెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బడ్జెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు మిగతా..2లో

## బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు‘: మేనిఫెస్టోను విడుదల చేసిన మమతా బెనర్జీ




2

- బంగాల్ ఎన్నికలు 2026
- టీఎంసీ మేనిఫెస్టోలోని 10 హామీలివే!

ఢిల్లి : బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మేనిఫెస్టోను సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. ‘బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు‘ శీర్షికన ఈ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను రూపొందించారు. ఈసందర్భంగా శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మేనిఫెస్టో ప్రజా కేంద్రకంగా ఉంటుందని ప్రకటించారు. బంగాల్‌లోకి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని అడ్డుకోవడం, బంగాల్ ఉనికిని కాపాడటం తమ పార్టీ లక్ష్యాలని ఆమె వెల్లడించారు. బంగాల్ ఎన్నికల తర్వాత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్సీ), జన గణన పేర్లతో ప్రజల పౌరసత్వాలను లాక్కునే యత్నాన్ని

## రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన

- కృష్ణా జిల్లాకు 3 గంటల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో తేలికపాటి ఈదురుగాలుల ప్రభావం



ఢిల్లి : పశ్చిమ బంగాళాఖాతం, సమీప ఉత్తరాంధ్ర సహా గంగాపరివాహక, బంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో కొనసాగుతుందని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. దీని ప్రభావంతో 24 గంటల్లో ఉత్తరాంధ్రలోని చాలా ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలో కొన్ని జిల్లాల్లో జల్లులు, కృష్ణా, గుంటూరు , బాపట్ల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉండగా 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాస్ సూచించారు. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు. రైతులకు బాసటగా నిలుస్తాం: తిరుపతి జిల్లా చంద్రగిరి గ్రామీణ ప్రాంతాల్లో మిగతా..2లో

## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం


### ఎన్నికల వేళ రాహుల్ గాంధీ

- త్వరలో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు
- రాష్ట్ర ప్రజలనుద్దేశించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పోస్ట్
- అధికార మార్పునకు కేరళ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యలు



ఢిల్లి : మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మిగతా..2లో

## ఇది నిరుద్యోగులను వంచించడమే.. చంద్రబాబుది పచ్చి మోసం



2

- రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య “ఖాళీలు బారెడు..
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతను నమ్మించి నయవంచన చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య “ఖాళీలు బారెడు..

## ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

- సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం
- భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు.
- గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు.



ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను మిగతా..2లో

## నాడు పాదయాత్రలో లోకేశ్ మాట... నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట




2

- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.
- యువతకు 2.3 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, వారిని నిలువునా వంచించారని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

అమరావతి : నాడు పాదయాత్రలో యువతకు ఇచ్చిన మాట ప్రకారం, నేడు జాబ్ క్యాలెండర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బాటలు వేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార,

### మొదటి పేజీ తరువాయి

## ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ... గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదించారు.

## ఇది నిరుద్యోగులను వంచించడమే.. చంద్రబాబుది పచ్చి మోసం

నోటిఫికేషన్లు చారెడు" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉగాది రోజున సీఎం చంద్రబాబు 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మే 15 నుంచి అక్టోబరు వరకు ఈ నియామకాలు పూర్తి చేస్తామని, ఇకపై ప్రతి ఏటా ఉగాదికి క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వ ప్రకటనపై షర్మిల ఘాటుగా స్పందించారు. "కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లు" కూటమి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండేళ్లుగా నిరుద్యోగులను ఊరించి చివరకు ఉసూరుమనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లోని ఖాళీలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. "విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, ఇంజనీరింగ్ విభాగంలో 20 వేలు, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, మున్సిపల్ శాఖలో 27 వేలు, రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలోని 153 విభాగాల్లో కలిపి 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి క్యాలెండర్లు కాకుండా భారీ స్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అలాగే, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## ఇకపై టెన్త్ పరీక్షలు ఉండవు.. విద్యావిధానంపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

### అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం మాట్లారంటే..

**బీఆర్ఎస్ ట్రాప్‌లో గాంధీ మనువడు:**

ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని సీఎం స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో నన్ను విచారణకి రమ్మని నోటీసు ఇస్తే వెళ్తానన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం మా ప్రణాళిక మాకు ఉందని చెప్పారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదన్నారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి మేం వ్యతిరేకం అని చెప్పారు. మూసీ విషయంలో ఆగేది లేదని నష్టపోయిన వారికి ఎలా ఆదుకోవాలో ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటామని చెప్పారు. ఢిల్లీకి ఎన్ని సార్లు వెళ్ళానో లెక్క పెట్టిన వాళ్లు నేను ఎన్ని నిధులు తెచ్చానో లెక్కపెట్టాలన్నారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడే గాంధీ మనువడు బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డాడని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లిన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేసుకుంటున్నారు. పంజాగుట్టలో ప్రైవేట్ కేసులో క్లీన్ చిట్ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో 6 వేల ఫోన్లు ట్యాప్ చేశారని 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు కేటీఆర్, హరీశ్ రావు ఏ విచారణ కోరినా అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పెళ్లికి పిలవలేదని అలిగిన బుజ్జి అభిమాని.. ఇంటికి పిలిచి 'స్పెషల్ ట్రీట్' ఇచ్చిన విజయ్-రష్మిక!

**బీజేపీ స్పందించదెందుకు?:**

డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే బీజేపీ స్పందించడం లేదని బీఆర్ఎస్ వాళ్ళని తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారు. నన్ను ముఖ్యమంత్రిగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు చెప్పారు. జీవన్ రెడ్డి అంశాన్ని పీసీసీ చీఫ్ చూసుకుంటుందన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిదని తానికి రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేదన్నారు.

## అంకెల ఆర్భాటాలు.. కేటాయింపుల ప్రగల్భాలే

ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు.

## బీఆర్ఎస్ లాగా చేసి ఉంటే బడ్జెట్ రూ.3,30 కోట్లు దాటేది..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం మీడియాతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి వివక్ష లేకుండా బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. ఉద్యోగులు అందరికీ కోటి రూపాయల బీమా కల్పించామని చెప్పారు. వాస్తవిక బడ్జెట్ కాబట్టే ఇక్కడితో ఆగామని బీఆర్ఎస్ మాదిరిగా చేసి ఉంటే బడ్జెట్ మూడు లక్షల 30 వేల కోట్ల వరకు వెళ్లేదని సెటైర్ వేశారు. అలా కాకుంటా వాస్తవ అంచనాలతో రూ.3,24,234 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు.

ఆర్భాటాలకు పోలేదు:

కాగా ఇవాళ బడ్జెట్ స్పీచ్ తాము ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చామని తద్వారా అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. తాము ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం అని పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇస్తున్న భరోసా అన్నారు.

## ఏపీ మద్యం కేసు.. ముప్పిడి అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అవినాశ్ రెడ్డి జైలు నుంచి బయటకు రానున్నారు. మరోవైపు, మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, సిండికేట్ల ఏర్పాటు వెనుక ఉన్న అసలు శక్తులను బయటకు తీసేందుకు సిట్ తన విచారణను మరింత వేగవంతం చేసింది.


## అంతా బోగస్... తెలంగాణ బడ్జెట్‌పై స్పందించిన హరీశ్ రావు

బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నాడు పాదయాత్రలో లోకేశ్ మాట... నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట

### మొదటి పేజీ తరువాయి

పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగంతో అల్లాడిన యువతకు తమ కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు 2.3 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, వారిని నిలువునా వంచించారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, గ్రాడ్యుయేట్లలో 24 శాతం మందికి ఉద్యోగాలు లేవని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని గుర్తు చేశారు. ఉపాధి లేక రాష్ట్రంలో 4,100 మంది యువకులు ఆత్మహత్య చేసుకోవడానికి వైసీపీ ప్రభుత్వ అసమర్థతే కారణమని ఎన్సీఆర్బీ నివేదికను ఉటంకిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 6,28,347 ఉద్యోగాలు కల్పించిందని పార్థసారథి గర్వంగా ప్రకటించారు. ఇప్పటికే 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, తాజాగా మరో 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా 2.5 లక్షల మందికి, జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా 1,46,620 మందికి, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు చూపించామన్నారు. నాడు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.



అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఉద్యోగ కల్పనతో పాటు సంక్షేమానికి కూడా తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయం తీసుకున్నామని, ఫిబ్రవరి 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12.5 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని ప్రకటించారు. సిటీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో పూర్తి ఉచితంగా, ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేవలం 24 గంటల్లోనే రూ.45 కోట్లను ముస్లిం సోదరుల ఖాతాల్లో జమ చేశామని, పోలవరం నిర్వాసితులకు మూడు విడతల్లో రూ.1,943 కోట్ల పరిహారం అందించామని చెప్పారు. "మీసాలు తిప్పి, తొడలు కొట్టినంత మాత్రాన పనులు కావు, చిత్తశుద్ధి ఉండాలి" అని వైసీపీ నేతలకు చురకలు అంటించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ గత ఏడాది 16,000 మంది టీచర్లను నియమించామని, తాజా క్యాలెండర్‌లో 1,500 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నామని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

జగన్‌ది హిందూ ధర్మ పరిరక్షణ కాదు.. భక్షణ: బుచ్చి రాంప్రసాద్

అనంతరం ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా దేవాలయాలపై దాడులు చేయించి, హిందూ మనోభావాలను దెబ్బతీసిన జగన్, ఇప్పుడు సాక్షి పత్రికలో 'హిందూ ధర్మ పరిరక్షకుడు' అని ప్రకటనలు ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పులివెందుల యాగంలో తీర్థాన్ని కింద పారబోయడం, ప్రదక్షిణలు చేయకపోవడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 300 దేవాలయాలపై దాడులు జరిగాయని, రామతీర్థం ఘటన, అంతర్వేది రథం దహనం వంటివి ప్రజలు మర్చిపోలేదని గుర్తు చేశారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడి కోట్లాది భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన పాపం జగన్‌దేనని ఆరోపించారు. క్రిస్టియన్‌గా అఫిడవిట్ ఇచ్చిన వ్యక్తి, తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం చేయని వ్యక్తి హిందూ ధర్మ రక్షకుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. చేసిన తప్పులకు క్షమాపణ కోరకుండా అబద్ధపు ప్రచారాలు కొనసాగిస్తే, ప్రజలు ఇచ్చిన 11 సీట్లు కూడా సున్నాకు పడిపోవడం ఖాయమని హెచ్చరించారు.

## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం: ఎన్నికల వేళ రాహుల్ గాంధీ

### మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "యూడీఎఫ్ కూటమి తరపున ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి కేరళం ప్రజల గొంతుకను, ఆకాంక్షలను, నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నారు. ఈ కూటమి అనుభవజ్ఞులైన నాయకులు, మార్పు తేవాలనే యువకుల కలయిక. నాకు కేరళం ఇల్లు. కేరళ ప్రజలు కుటుంబ సభ్యులు. కేరళ ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు వారికి నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను ఎల్లప్పుడూ ప్రజల భాగస్వామిగా ఉంటాను. కేరళం నుంచి వస్తున్న సందేశం స్పష్టం. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ప్రజల మాట వినే, వారిని అర్థం చేసుకునే, నిజాయితీతో పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. రాబోయే యూడీఎఫ్ ప్రభుత్వంతో కలిసి ఈ అందమైన రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించడానికి నేను చేయగలిగినదంతా చేస్తాను. కేరళం గెలుస్తుంది- అందుకు యూడీఎఫ్ నాయకత్వం వహిస్తుంది."

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ**

**ఇక నుంచి ఆ విధానం పనిచేయదు : శశిథరూర్**

కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కేరళలోని



ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విదేశాల నుంచి వచ్చే నగదు, లాటరీలు, మద్యంపై ఆధారపడేలా చేస్తోందని శశిథరూర్ ఆరోపించారు. ఇక నుంచి ఈ విధానం పనిచేయదని మండిపడ్డారు. కేరళలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రణాళిక, ఎల్‌డీఎఫ్ పదేళ్ల పాలనపై ఉన్న వ్యతిరేకత కంటే చాలా సానుకూలంగా ఉందని తెలిపారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తోందని శశిథరూర్ విమర్శించారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ నాటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు అయిపోతున్నాయని, ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం అప్పు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్ ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజలకు చూపించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమా అని అడగ్గా, థరూర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. తమ పార్టీ ధ్యేయం చాలా సానుకూలమైనదని భావిస్తున్నానని తెలిపారు. అది కేరళ 2.0కి సంబంధించినదని వివరించారు. "యూడీఎఫ్ పార్టీ మేనిఫెస్టో ఇంకా వెలువడలేదు. అయితే రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలనేది తాను ప్రతిపాదిస్తున్న ఐడియాల్లో ఒకటి. కేరళ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం చేసిన తప్పులన్నింటికీ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పెన్షన్ వంటి ఐదు నిర్దిష్ట హామీలను ప్రజలకు ఇచ్చాం. విదేశాల నుంచి వచ్చే డబ్బు, లాటరీలు, మద్యం రాష్ట్రాన్ని నడిపిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే ప్రాజెక్టుల కోసం చేసే ఖర్చు కంటే అప్పుల చెల్లింపులు, వాటిపై వడ్డీలు, జీతాలు, పెన్షన్ల కోసమే కేరళ సర్కార్ ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తోంది. దేశంలో అత్యధిక పన్నులు చెల్లిస్తున్నది కేరళ వాసులే. అత్యధిక ఆస్తి పన్ను, అత్యధిక స్టాంప్ డ్యూటీ కడుతున్నారు. నా దగ్గర చాలా ఆలోచనలు ఉన్నాయి. కాంగ్రెస్-యూడీఎఫ్‌ల దగ్గర కూడా ఇంతవరకు ప్రయత్నించని కొత్త విషయాల కోసం చాలా ఐడియాలు ఉన్నాయి. "

- శశిథరూర్, కాంగ్రెస్ ఎంపీ

బీజేపీపై కీలక వ్యాఖ్యలు

త్వరలో కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక నామమాత్రపు పార్టీగానే మిగిలిపోతుందని శశిథరూర్ జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్యనే ఉంటుందన్నారు. "కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉండదు. ఎందుకంటే అసెంబ్లీలో బీజేపీకి ప్రస్తుతం ఉన్న సీట్లు సున్నా. సున్నా నుంచి ఒకటి, రెండు లేదా మూడు సీట్లకు వెళితే వారు (బీజేపీ నేతలు) చాలా గర్వంగా, సంతోషంగా ఉంటారు. గొప్ప విజయం సాధించామని తమను తాము అభినందించుకుంటారు. బీజేపీ ప్రస్తుతం అలాంటి పరిస్థితిలోనే ఉంది" అని శశిథరూర్ పేర్కొన్నారు.


## రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు - రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన

### మొదటి పేజీ తరువాయి

బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులు వరి, మామిడి పంటలు నష్టపోయారు. అకాల వర్షంతో రైతులు ఇబ్బంది పడ్డారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం సంబంధిత అధికారులు, రైతులు, నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. బందార్లపల్లి, రంగంపేట, కూచివారిపల్లి గ్రామాలలో అత్యధికంగా వరి పంట సుమారు దెబ్బై నుంచి ఎనభై ఎకరాల మేర నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతుల నుంచి వివరాలు సేకరించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు రైతులకు బాసటగా నిలుస్తున్నాయన్నారు.

**దెబ్బతిన్న పంటపొలాలు:**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలో ఈదురు గాలులకు దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. భారీ గాలులు, వర్షాల కారణంగా జగ్గయ్యపేట మండలంలోని మొక్కజొన్న, మామిడి, మిర్చి, అరటి, బొబ్బయి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జగ్గయ్యపేట మండలంలో గండ్రాయి, మల్కాపురం గ్రామాలలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. 'నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున అందాల్సిన పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటాం. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా అధికారులను సిద్ధం చేస్తాం. రైతులకు అండగా నిలుస్తూ, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం.' - శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఎమ్మెల్యే అన్నదాతల కంటతడి: నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో కురిసిన వడగండ్ల వాన రైతులను నిలువునా ముంచింది. వరి, పత్తి, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో కురిసిన ఆకాల




వర్షానికి సుమారు 2300 ఎకరాల్లో వరి, 350 ఎకరాల్లో పత్తి పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ఆకాల వర్షం రావడంతో పూర్తిగా నష్టపోయామని అన్నదాతలు కంటతడి పెట్టుకున్నారు. ప్రభుత్వమే తమకు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు':ఎవీజ మేనిఫెస్టోను విడుదల చేసిన మమతా బెనర్జీ

### మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దీదీ ఆరోపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఆమె కోరారు.

**టీఎంసీ మేనిఫెస్టోలోని 10 హామీలివే!**

లక్ష్మీర్ భండార్ స్కీం ద్వారా మహిళలకు ప్రతినెలా అందించే ఆర్థిక సహాయం మరో రూ.500 పెంపు. ఈ ఎన్నికల్లో టీఎంసీ గెలిస్తే, లక్ష్మీర్ భండార్ స్కీం ద్వారా జనరల్ కేటగిరీ మహిళలకు ప్రతినెలా రూ.1,500, ఎస్సీ,ఎస్టీ మహిళలకు ప్రతినెలా రూ.1,700 సాయం. నిరుద్యోగ యువతకు బంగ్లార్ యుబ సాథీ స్కీం ద్వారా ప్రతినెలా రూ.1,500 భత్యాన్ని అందించడాన్ని కొనసాగిస్తారు. రైతులు, కౌలు రైతులకు చేయూతను అందించడానికి రూ.30వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ప్రతీ కుటుంబానికి పక్కా ఇళ్ల నిర్మాణం అన్ని ఇళ్లకు పైప్‌లైన్ల ద్వారా రక్షిత మంచినీటి సరఫరా ఆరోగ్య సంరక్షణ సేవలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా దువారే చికిత్సా క్యాంపుల నిర్వహణ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన తూర్పు భారతదేశంలో ట్రేడ్ హబ్‌గా బంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం, ఇందుకోసం ఆధునిక రవాణా వసతుల కల్పన, గ్లోబల్ ట్రేడ్ సెంటర్ నిర్మాణం. వృద్ధాప్య పెన్షన్లను ఇవ్వడాన్ని కొనసాగిస్తూనే, వాటిని మరింత మందికి మంజూరు చేయడం. బంగాల్ రాష్ట్రంలో ఏడు కొత్త జిల్లాల ఏర్పాటు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో విస్తరణ చేయడం. సంతోషపు వెలుగులు ప్రతీ ఇంటికి చేరాలి! "నేను బంగాల్ ప్రజలకు 10 హామీలను ఇస్తున్నాను. తప్పకుండా వీటిని రాబోయే ఐదేళ్ల పాటు అమలు చేస్తాను. రాష్ట్రంలోని గడపగడపకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను చేరుస్తాను. ఇందుకోసం ప్రతీ బ్లాక్ పరిధిలో దువారే చికిత్సా క్యాంపులను ఏర్పాటు చేస్తాం. బంగాల్ రాష్ట్ర అభివృద్ధి చక్రాలు ఎలాంటి అంతరాయం లేకుండా తిరిగేందుకు దోహదం చేసేలా మా మేనిఫెస్టోను రూపొందించాం. సంతోషపు వెలుగులు బంగాల్‌లోని ప్రతీ ఇంటికి చేరాలి అనేది మా లక్ష్యం" అని ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో సీఎం మమతా బెనర్జీ తెలిపారు.

**బంగాల్‌లో అనధికారిక రాష్ట్రపతి పాలన**

"ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బదిలీ ప్రక్రియను ఈసీ చేస్తోంది. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోకి డబ్బు, ఆయుధాలను తరలించేందుకు, బీజేపీ సూచనల మేరకు అధికారులను ఈసీ బదిలీ చేస్తోంది. ఈసీ చర్యలన్నీ చూస్తుంటే, బంగాల్‌లో అనధికారిక రాష్ట్రపతి పాలనను అమలు చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఈసీ, కేంద్ర ప్రభుత్వం కలిసి ఈ పరిస్థితిని సృష్టించాయి. ఎన్నికల్లో ఓటమి తప్పదనే విషయాన్ని గ్రహించబట్టే బీజేపీ ఇవన్నీ చేయిస్తోంది. ఇలా చేయడం సిగ్గుచేటు. అధికారుల బదిలీలకు ఒక పరిమితి అనేది ఉంటుంది. కానీ ఈసారి అన్ని శాఖల ఆఫీసర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇలాంటప్పుడు ఒకవేళ ప్రజలకు రేషన్ సరుకులు అందకుంటే, వాళ్లు ఎవరి దగ్గరకు వెళ్లాలి? ఇప్పుడు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన వాళ్లకు ఈ రాష్ట్రం కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు కానీ తెలియవు" అని సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు.

10 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితాల నుంచి తొలగింపు

"ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రత్యేకించి ఒక నిర్దిష్ట సామాజిక వర్గం ప్రజలను వివక్షాపూరితంగా టార్గెట్ చేస్తున్నారు. దాదాపు 60 లక్షల మంది ఎస్ఐఆర్ దరఖాస్తులపై విచారణ జరపగా, 22 లక్షల దరఖాస్తులనే ఆమోదించారని నేను విన్నాను. ఇంచుమించు 10 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించారట. ఈ గణాంకాలను క్రాస్ చెక్ చేయాల్సి ఉంది" అని సీఎం మమతా బెనర్జీ చెప్పారు.

**బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా 'పునర్విభజన'**

"వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా, రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కుట్రపన్నాయి. ఈ ఎన్నికల తర్వాతే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియ జరిగితే రాజకీయ ప్రాతినిధ్య గణాంకాలు మారిపోతాయి. వచ్చే ఎన్నికల్లో బీజేపీని కేంద్రంలో అధికారంలోకి రానివ్వం. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చడం, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనాలను చేకూర్చడాన్నే బీజేపీ పనిగా పెట్టుకుంది. రైల్వేలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే ప్రక్రియను మొదలుపెట్టింది. భారతదేశాన్ని లూటీ చేసి విదేశాలకు పారిపోయిన వాళ్లకూ ప్రభుత్వరంగ సంస్థలను అప్పగించే యత్నాలు జరుగుతున్నాయి. బీజేపీ రాజకీయ టార్గెట్‌లో బంగాల్ ఉంది. దేశంలో బలమైన రాష్ట్రంగా బంగాల్ ఉండాలని ఆ పార్టీ కోరుకోవడం లేదు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ఈ ఎన్నికలే సరైన సమయం. ఈ దేశాన్ని మనం మోదీ నుంచి కాపాడాలి. బంగాల్ ప్రజలు తప్పకుండా బీజేపీకి ధీటైన సమాధానాన్ని ఇస్తారు" అని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తెలిపారు.

## ఇరాన్-అమెరికా.. ఎందుకోసం ఈ యుద్ధం?

ఇరాన్‌పై అమెరికా యుద్ధానికి ఆ దేశ ప్రజల్లో అత్యధికుల నుంచిగానీ, ఐరాస నుంచిగానీ ఎలాంటి ఆమోదం లేదు. ఈ పోరులోని చట్టబద్ధతను కొందరు అమెరికా చట్టసభ సభ్యులే ప్రశ్నించారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత అంతర్జాతీయ మానవీయ చట్టాల పరంగా సాధించిన పురోగతిని ఈ కదనం దెబ్బతీస్తోంది. బలసంపన్నుడు ఏం చేసినా ఆమోదనీయమే అనే ఆటవిక న్యాయాన్ని ఇది పునరుద్ధరించింది. ఇరాన్‌పై యుద్ధం ఎందుకోసం, అసలు అది ఎవరి ఉన్మాదమన్న మౌలిక ప్రశ్న ఎదురవుతోంది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టాక ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరుసార్లు వాషింగ్టన్‌ను సందర్శించారు. ఆ సమయంలో ఇరాన్‌లో నాయకత్వాన్ని మార్చాలన్న తన అజెండాను అమలు చేసేందుకు ట్రంప్‌ను ఆయన ఒప్పించి ఉంటారన్నది బహిరంగ రహస్యమే. ఎందుకంటే, ఇరాన్‌లో అధికార మార్పిడి తన 40 ఏళ్ల కల అని నెతన్యాహు ఎప్పటినుంచో చెబుతున్నారు. గతంలో గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, ఇప్పుడు ఇరాన్... తనను సవాలు చేసే ఎవరినైనా తుడిచిపెట్టేసి ప్రాంతీయంగా ఒక ఆధిపత్య శక్తిగా ఎదగాలని ఇజ్రాయెల్ భావిస్తోంది.

నెతన్యాహు వికృత క్రీడ

ట్రంప్ విషయానికొస్తే, ఆయన యుద్ధ లక్ష్యం ఏరోజు కారోజు మారిపోతోంది. ఒకరోజు ఇరాన్‌లో అధికార మార్పిడి జరగాలంటారు. మరో రోజేమో టెహ్రాన్ నుంచి అణు ముప్పును పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయమని చెబుతారు. ఇంకోసారి అమెరికా మిత్ర రాజ్యాలపై దాడి చేయకుండా ఇరాన్‌ను ముందుగానే నిలువరించడానికి ఇదంతా చేస్తున్నట్లు ప్రకటిస్తారు. దశాబ్దాలుగా అమెరికా మోపిన ఆంక్షలతో ఇరాన్ సతమతమవుతోంది. అది వెన్నుదన్నుగా నిలిచిన హమాస్, హెజ్‌బొల్లాల శక్తీ క్షీణించింది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం మాటల దాడి చేయడం తప్ప అమెరికాకు నిజంగా ముప్పు కలిగించే స్థితిలో ఇరాన్ లేదు. పైగా అది అణ్వాయుధాలు తయారు చేస్తున్న దాఖలాలేవీ లేవని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ మారియానో ఇటీవల వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే అమెరికా వాదనలో పస లేదని అర్థమవుతుంది. గతంలో ఇరాక్‌పై దండయాత్రకు దిగడానికి ముందు ప్రమాదకర ఆయుధాలున్నాయన్న ఆరోపణలే చేశారు. ఒక దేశంగా ఆవిర్భవించింది మొదలు ఇరుగు పొరుగు దేశాలు, ఇతర ముఠాల నుంచి ఎదురయ్యే ముప్పులను కాచుకోవడంపై ఇజ్రాయెల్ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్, సైనిక సాంకేతికతల పరంగా అది గణనీయ పురోగతి సాధించింది. ఏళ్లుగా వెస్ట్‌బ్యాంక్, గాజాల్లో విరుచుకుపడుతూ తన సామర్థ్యాల్లో టెల్‌అవీవ్ మరింత రాటుదేలింది. కానీ, తన పౌరులకు శాంతియుత జీవనాన్ని అందించడం, పొరుగు దేశాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనాలన్న

# సంపాదకీయం

## అమెరికా వెలుగులకు క్యూబన్ చీకట్లు ఎందుకు?

'క్యూబా విషయంలో నేను ఏమనుకుంటే అది చేయగలను.. దాన్ని స్వాధీనం చేసుకునే గౌరవం నాకు లభిస్తుందని భావిస్తున్నాను' నాలుగురోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. ఇరాన్ మీద మొదలుపెట్టిన అధర్మయుద్ధంలో కూరుకుపోయి ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో మరో దేశాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లుగా ఈ వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. ఇటీవల కాలంలో వెనెజువెలాతో మొదలైన ప్రభుత్వాధినేతల మార్పు, అనుకూల రాజ్యాల ప్రతిష్ఠాపన పరంపరలో త్వరలో క్యూబా చేరబోతోంది. అమెరికాతో విభేదించి, దాని సామ్రాజ్య కాంక్షలకు గండికొట్టి, నచ్చిన మార్గంలో స్వతంత్రంగా వ్యవహరించిన దేశాల్లో ఒకప్పుడు క్యూబాకు ప్రముఖస్థానం ఉంది. పశ్చిమాసియాలో అమెరికా ఆధిపత్యానికి ఇరాన్ ఒకరకంగా 1979లో సవాలు విసిరితే అంతకు 20 ఏళ్లకు ముందు క్యూబా అంతకుమించిన సాహసాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శించింది. ఇరాన్‌లో 1979 నాటి ఇస్లామిక్ విప్లవం దాని చుట్టూ ఉన్న కొన్ని ముస్లిందేశాల పాలకులను భయపెడితే, 1959 నాటి క్యూబన్ విప్లవం లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఎందరికో ఉత్తేజంగా నిలిచింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ముఖ్యంగా సొంత ఖండంలో తనకు తిరుగులేదనుకున్న అమెరికాకు క్యూబా పక్కలో బల్లెంలా మారింది. అమెరికా కోరుకున్న రాజకీయ వ్యవస్థలను ఏర్పాటుచేయలేని, కావాలనుకునే ఆర్థిక విధానాలను అమలుచేయలేని చిన్న, మధ్యస్థాయి దేశాలకు వరుసగా ముప్పు ముంచుకొస్తోందని ట్రంప్ వ్యాఖ్యలను చూస్తే తేలికగా అర్థమవుతుంది. పరిస్థితి అంతమేరకే పరిమితమయ్యేలా ఉందని కూడా చెప్పలేం. భారత్ లాంటి పెద్దదేశమే ఎటూ నోరు విప్పలేని స్థితిలో ఉంది. రష్యా నుంచి చమురు కొనొద్దని శాసిస్తే అమలుపరచాల్సిన అగత్యం ఏర్పడింది. ఇరాన్‌పై దాడులతో ఏర్పడిన ఒడుదుడుకులను ఎదుర్కోటానికి రష్యా నుంచి నెలపాటు చమురు కొనుగోళ్లకు భారత్‌కు అనుమతిని ఇస్తున్నామని బహిరంగంగా ప్రకటించి చిన్నబుచ్చినా ఏమీచేయలేని అశక్తత ఆవరించింది. చైనా లాగా భారత్‌ని ఆర్థికంగా ఎదగనీయబోమనే అర్థంలో అమెరికా విదేశాంగశాఖ సహాయమంత్రి క్రిస్టాఫర్ లాండో ఈనెల 5న ఢిల్లీలో ప్రకటించినా గట్టిగా, సూటిగా, నిక్కచ్చిగా ఖండించలేని నిర్బలతే కన్పించింది. భారతఅమెరికా వ్యాపార సంబంధాలపై ఏర్పాటైన చర్చావేదికపైనే ఎటువంటి మొహమాటం లేకుండా లాండో ఆ ప్రకటన చేశారు. అమెరికాను మరోమారు గొప్పదేశంగా మారుస్తామనే నినాదాన్నీ విధానాన్నీ అందిపుచ్చుకున్న తర్వాత సంభాషణల్లో, ప్రకటనల్లో ఔచిత్యాలను ఆ దేశ నాయకులు పట్టించుకోవటం లేదు. వస్తుసేవల్లో నాణ్యతను మెరుగుపరచటానికీ, నవ్యతను తీసుకురావటానికీ, కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటానికీ వ్యాపారరంగంలో పోటీతత్వానికి మించిన ప్రత్యామ్నాయం లేదని ఒకప్పుడు ఇంటాబయటా వినిపించిన వాదనలు ఇప్పుడు కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించటం లేదు. అమెరికాకు పూర్వవైభవాన్ని తేవటానికి ఏ దుశ్చర్యకైనా దిగుతామనే ధోరణే ఇప్పుడు వినిపిస్తోంది. దేశాల మధ్య తలెత్తే సమస్యల పరిష్కారానికి మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన నానాజాతి సమితిని హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలు పట్టించుకోలేదు. విజేత రాజ్యాలన్నీ కలిసి ఏర్పాటుచేసిన సంస్థను ఎందుకు లెక్కపెట్టాలన్న ధోరణితో దాని నిబంధనలన్నిటినీ ధిక్కరించి హిట్లర్ యూరప్‌లో ఒక్కోరాజ్యాన్ని చెరబట్టారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత స్వయంగా అమెరికా ప్రోద్బలంతో ఏర్పాటైన ఐక్యరాజ్యసమితికీ ఇప్పుడు అదేస్థితి వచ్చింది. తేడా అల్లా ఒక్కటే. స్థాపించిన వారే ఇప్పుడు దాని అస్తిత్వాన్ని లెక్కచేయటం లేదు. ఐక్యరాజ్యసమితికి సమస్యలు తీసుకెళ్లకుండా, అందులో చర్చలు లేకుండా యుద్ధాలను ప్రకటించటమూ, రాజ్యాధినేతలను ఎత్తుకుని పోవటమూ, హతమార్చటమూ అమెరికాకు ఇప్పుడు రివాజుగా మారింది. అమెరికాకు భూభాగం కొరత ఎప్పుడూ లేదు. విస్తీర్ణం పరంగా ప్రపంచంలో మూడోస్థానంలో ఉంది. వనరులపరంగానూ లోటులేదు. కానీ విస్తరణకాంక్షతోనే మొదటినుంచీ తన్నుకులాడుతోంది. క్యూబా విషయంలో అది మరింత నిజం. క్యూబాను స్పెయిన్ నుంచి కొనుగోలు చేయటానికి ప్రయత్నాలూ చేశారు, ఆక్రమించుకోటానికి పావులూ కదిపారు. థామస్ జఫర్‌సన్ అమెరికా అధ్యక్షుడిగా (18011809) ఉన్నప్పుడే ఈ వ్యవహారాలు నడిచాయి. స్పెయిన్ వాటిని పడనీయలేదు. లాటిన్ అమెరికాలో మిగతా దేశాలపై పెత్తనాన్ని 1820ల నాటికే వదులుకోవాల్సి వచ్చినా క్యూబాపై పట్టును వీడలేదు. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో ఆనాడు క్యూబా అగ్రస్థానంలో ఉండటమే అందుకు కారణం. 19వ శతాబ్దంలో సామ్రాజ్యశక్తిగా స్పెయిన్ ప్రాబల్యం క్షీణించిపోయింది. అదే సమయంలో క్యూబన్ జాతీయవాదులు బలం పుంజుకున్నారు. స్పెయిన్‌పై యుద్ధానికీ దిగారు. విస్తరణకాంక్షతో ఉన్న అమెరికాకు అది చక్కని అవకాశంగా పరిణమించింది. జాతీయవాదుల పక్షాన స్పెయిన్‌తో యుద్ధానికి దిగింది. స్పెయిన్ ఓడిపోయింది. క్యూబాకు స్వాతంత్ర్యం లభించింది. అయితే ఆ సంతోషం కొద్దికాలం కూడా నిలవలేదు. అన్నింటా తనకు లోబడి ఉండాలనే షరతులను అమెరికా విధించింది. అనుకూల వ్యాపార ఒప్పందాలను క్యూబాపై రుద్దింది. సముద్రతీరం పక్కనే ఉన్న క్యూబాకు చెందిన 'గ్వాంటానమోబే'నీ అప్పుడే స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ అమెరికా సైనికస్థావరం అక్కడే ఉంది. పేరుకు స్వతంత్రదేశమైనా అమెరికాను ఎదిరించలేని క్యూబా నిజానికి వలస ప్రాంతంగానే ఉండిపోయింది. 1898 నుంచి 1933 వరకూ అమెరికా సైన్యం క్యూబా నుంచీ కదల్లేదు. పొరుగుదేశాలతో మంచిగా మెలగాలంటూ

# నొప్పికీ చికిత్స ఉంది!



'మా అమ్మగారు రోజంతా నొప్పితో బాధపడేవారు. అప్పట్లో మాకెవరూ పాలియేటివ్ కేర్ (నొప్పి నివారణ చికిత్స) గురించి చెప్పలేదు' అని సినీ నటుడు నాగార్జున బాధా ఉపశమన చికిత్స గురించి వెలువరించిన వీడియోలో గద్గదమయ్యారు. 'తరవాత మా నాన్నగారికి క్యాన్సర్ వచ్చింది. ఆయనకూ కొన్నిసార్లు నొప్పి వచ్చేది కానీ, వెంటనే పాలియేటివ్ కేర్ బృందం రంగంలోకి దిగేది. దానివల్ల మా నాన్నగారికే కాదు, కుటుంబం మొత్తానికి ఊరట లభించేది' అన్నారాయన. నాగార్జున మాతృమూర్తి కీళ్లకు అప్పట్లో చికిత్స చేశారే తప్ప, నొప్పికి కాదు. దేశీయంగా ఎంతో మంది ఇదే విధంగా భరించలేని నొప్పులతో అల్లాడిపోతున్నారు. నేను ఎంబీబీఎస్, హౌస్ సర్జన్, పీజీ కోర్సు అభ్యసించిన కాలంలో శరీరం, అందులోని అవయవాలు, వ్యాధులు, రోగకారక సూక్ష్మజీవులు, కణుతుల గురించి తెలుసుకున్నప్పటికీ జబ్బుల వల్ల మనిషికి కలిగే నొప్పి గురించి ప్రత్యేకంగా నేర్చుకున్నది లేదు. మరి వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు– వీరి బాధ్యత ఏమిటి? అలాగే ఔషధ నియంత్రణ అధికారులు, ఆరోగ్య శాఖ కార్యదర్శులు, మంత్రుల బాధ్యత ఏమిటి? భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) బయో ఎథిక్స్ విభాగ నిర్వచనం ప్రకారం వైద్య సిబ్బంది ప్రాథమిక బాధ్యత– రోగుల బాధను తగ్గించడం. జబ్బును వీలైతే పూర్తిగా నయం చేయడం, తరచూ ఉపశమనం కలిగించడం, ఎల్లప్పుడూ ఓదార్పునివ్వడం. కానీ ఈ మాటలు వైద్య, నర్సింగ్ కళాశాలల గ్రంథాలయాల్లో ఎవరూ చదవని పుస్తకాల్లోనే ఉండిపోతున్నాయి.

### పుంగనూరు విషాద గాథ

ఉపశమన చికిత్స (పాలియేటివ్ కేర్) అంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యల వల్ల కలిగే బాధను నివారిస్తూ చికిత్స చేయడం. ఇది రోగి, వారి కుటుంబ సభ్యుల జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. జబ్బు ఏ దశలో ఉన్నా వీలైనంత వరకు బాధను తగ్గించడం వైద్యుడి బాధ్యత కాదా? ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ హృదయ విదారక సంఘటన గురించి ఇక్కడ చెప్పుకోవాలి. పుంగనూరుకు చెందిన దంపతుల కుమారుడికి చిన్న వయసులోనే క్యాన్సర్ వచ్చింది. ఆ పిల్లాడు భరించలేని నొప్పితో విలవిల్లాడేవాడు. కుమారుడి వైద్య చికిత్స కోసం తల్లిదండ్రులు దక్షిణ భారతమంతా తిరిగారు. అప్పుల పాలయ్యారు. క్యాన్సర్‌కైతే చికిత్స మీద చికిత్స చేశారు. కానీ, నొప్పి నుంచి ఉపశమనం దక్కలేదు. చివరికి ఆ బాబుకు వచ్చిన క్యాన్సర్ నయం కాదని తేలిపోయినా చికిత్స కొనసాగింది. భరించలేని నొప్పితో పిల్లాడు అదేపనిగా ఏడుస్తుంటే తాము తట్టుకోలేకపోయేవాళ్లమని, అతడికి కారుణ్య మరణం ప్రసాదించాలని కోర్టుకు అర్జీ పెట్టుకున్నామని తండ్రి చెప్పారు. కోర్టు ఆయన వినతిని తిరస్కరించింది. ఈ ఉదంతం పత్రికల ద్వారా మా దృష్టికి వచ్చి ఆ బాలుడు ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నించాం. కొన్ని రోజులకు అతడు హైదరాబాద్‌లోని ఒక ఆస్పత్రిలో ఉన్నాడని తెలుసుకున్నాం. అక్కడికి కూతవేటు దూరంలోనే దేశంలో అత్యుత్తమ బాధా నివారణ చికిత్స అందించే ఎంఎన్‌జే ప్రాంతీయ క్యాన్సర్ సెంటర్ ఉంది. అక్కడ లభించే ఉపశమన చికిత్స గురించి చాలామందిలాగే ఆ కుటుంబానికీ తెలియదు. ఎంఎన్‌జే కేంద్రం నుంచి ఒక సంఘ సేవిక ఆ బాలుడి కోసం ఆస్పత్రికి వెళ్లగా, తల్లిదండ్రులు అతణ్ని తీసుకుని చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లిపోయినట్లు తెలిసింది. దాంతో ఆమె నొప్పి నివారణ మందులు తీసుకుని అదే రాత్రి బెంగళూరు వెళ్లారు. అక్కడి ఆస్పత్రిలోనూ బాలుడికి ఉపశమన చికిత్స లభించడం లేదు. పైగా ఐసీయూలో పెట్టి అనవసరమైన చికిత్స చేస్తున్నారు. తల్లిదండ్రులను, సంఘ సేవికను, ఆమె తెచ్చిన మందులను ఐసీయూలోకి అనుమతించలేదు. ఆ బాలుడు తన నాలుగో పుట్టిన రోజు గడిచిన మరునాడే దుర్భరమైన నొప్పితో ఐసీయూలోనే మరణించాడు. కుమారుడి బాధ చూడలేక కారుణ్య మరణం కోసం తల్లిదండ్రులు ప్రయత్నించాల్సి రావడంకన్నా ఘోరం మరొకటి ఉంటుందా? బాధ నివారణకు అవకాశం ఉన్నా, దానిపై తగిన ప్రచారం, అవగాహన లేకపోవడం వల్లే ఎంతోమంది దీనావస్థలో భయంకరమైన నొప్పిని భరించాల్సి వస్తోంది. భారతదేశంలో నొప్పి నివారణ మందులు అవసరమైన వారిలో నాలుగు శాతంకన్నా తక్కువ మందికే అవి అందుతున్నాయి. 2025లో సుప్రీంకోర్టు జీవించే హక్కులో ఆరోగ్య హక్కు భాగం, ఆ ఆరోగ్య హక్కులో పాలియేటివ్ కేర్ కూడా అంతర్భాగమని ఉద్ఘాటించింది. మన దేశంలో జాతీయ బాధా ఉపశమన కార్యక్రమం కూడా అమలవుతోంది. నొప్పి నివారణకు అత్యవసర మందులు అందించడానికి వీలు కల్పిస్తూ 2014లో పార్లమెంటు మాదకద్రవ్యాలు, సైకోట్రాపిక్ పదార్థాల నియంత్రణ చట్టానికి సవరణలు చేసింది. 2017 నాటి జాతీయ ఆరోగ్య విధానంలోనూ బాధా ఉపశమన చికిత్స అంతర్భాగంగా ఉంది. 2019 నుంచి ఎంబీబీఎస్ పాఠ్యప్రణాళికలో, 2022 నుంచి నర్సింగ్ పాఠ్యప్రణాళికలో ఉపశమన చికిత్సను చేర్చారు. విధానపరంగా మార్పులు వచ్చినా, అమలులో ఇంకా ఎంతో వెనకబడి ఉన్నాం. వైద్య వ్యవస్థ జబ్బులను మాత్రమే కాదు, బాధను కూడా నయం చేయాలి.

### కేరళ బాట అనుసరణీయం

కేరళలోని కాలికట్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 1993లో ఇద్దరు అనస్థీసియా వైద్యులు, ఒక సామాన్యుడు కలిసి ఔట్ పేషంట్ల కోసం చిన్న బాధా నివారణ క్లినిక్ ప్రారంభించారు. వారికి ఇద్దరు స్వచ్ఛంద సేవకులు జతకలిశారు. అది ఒక ప్రజా ఉద్యమంగా మారింది. 2000 సంవత్సరంకల్లా ఉత్తర కేరళలో 40 నొప్పి నివారణ కేంద్రాలు ఏర్పడ్డాయి. నేడు కేరళలో 960 పైచిలుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా, వాటిలో ప్రతిచోటా ఒక పాలియేటివ్ కేర్ నర్సు ఉన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి రోగులను పరామర్శిస్తారు. ఇంకా 350 స్వచ్ఛంద సంస్థలు కూడా ఉపశమన చికిత్సలు అందిస్తున్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల అక్కడ అద్భుతమైన మార్పు వచ్చింది. సామాజిక భాగస్వామ్యం ఉంటేనే ఆరోగ్య రంగం పరిపూర్ణమవుతుందని కేరళ నమూనా నిరూపిస్తోంది.

# హార్ముజ్.. ఇరాన్ కొత్త రూల్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటి హార్ముజ్ జలసంధి. ఇది ఇప్పుడు సరికొత్త దౌత్య యుద్ధానికి వేదికైంది. యుద్ధం అంటే కేవలం క్షిపణుల ప్రయోగమే కాదు, వ్యూహాత్మక ఎత్తుగడల చదరంగం అని ఇరాన్ మరోసారి నిరూపిస్తున్నది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ప్రతిపాదిం చిన 'కొత్త ప్రాంతీయ ప్రొటోకాల్' సహజ సిద్ధమైన జలమార్గాన్ని తన సొంత ఆస్తిగా మార్చుకోవడంతో పాటు అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బకొట్టాలన్న ఇరాన్ దీర్ఘకాలిక ఎత్తుగడగా పరిగణించాలి.

మరోవైపు, ఈ సంక్షోభం అట్లాంటిక్ మహాసముద్రం ఇరువైపులా ఉన్న మిత్ర దేశాల మధ్య ఐక్యతను కుప్పకూల్చుతున్నది. మొత్తానికి హార్ముజ్ చుట్టూ ముదురుతున్న ఈ మంటలు కేవలం చమురు ధరలనే కాదు.. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న అంతర్జాతీయ దౌత్య సమీకర ణాలను కూడా మార్చేలా కనిపిస్తున్నాయి.

అగ్గి రగిల్చిన అరాక్చీ!

ఇరాన్ ఓటమి అంచున ఉన్నది. ఏ క్షణమైనా ముందు బేషరతుగా లొంగిపోవచ్చని అమెరికా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని.. ఇరాన్ తాజా ప్రతిపాదనలు నిరూ పిస్తున్నాయి. తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. యుద్ధం ముగిసిన తర్వాత హార్ముజ్ జలసంధిలో 'కొత్త ప్రాంతీయ ప్రొటోకాల్' ఉండాలని పశ్చిమ దేశాల నౌకలు ఈ మార్గంలో వెళ్లాలంటే ఇరాన్ విధించే కొత్త షరతులకు తలవొంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓవైపు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ 'హార్ముజ్ జలసంధిని తెరవడానికి మిత్రదేశాలన్నీ సైన్యాన్ని పంపాలి' అని పిలుపునిచ్చారు. కానీ యూరప్ స్పందన భిన్నంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు అమెరికా యుద్ధ ప్రయత్నాల్లో నేరుగా చేరడానికి నిరాకరిస్తున్నాయి. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల తాము ఇరాన్ ప్రతీకార దాడులకు లక్ష్యంగా మారకూడదని అవి భావిస్తున్నాయి.

అమెరికాకు దెబ్బ కాదు.. కానీ

అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన ఉత్పత్తిదారు కాబట్టి ఈ చమురు ధరల పెరుగుదల దానికి పెద్ద దెబ్బ కాదు. కానీ యూరప్ ఇంధనం కోసం గల్ఫ్ దేశాలపై ఆధార పడుతుంది. అమెరికా ఆంక్షలతో రష్యా ఇంధనాన్ని కూడా వదులుకోవడంతో గ్యాస్ ధరలు 20% పెరగడం యూరప్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నది. హార్ముజ్ ద్వారా వచ్చే 60% చమురు సరఫరా నిలిచిపోవడంతో భారత్ ఇప్పటికే రష్యా నుండి వచ్చే చమురుపై ఆధారపడటం పెంచింది. ఇరాన్ నుండి రెండు ఇండియన్ ఎల్‌పీజీ ట్యాంకర్లకు మినహాయింపు లభించడం మనకు భారీగా ఊరట లభించింది.

### ఇరాన్ షరతులు..

అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నౌకలు మినహా మిగిలిన వాణిజ్య నౌకలు 'ఇన్నోసెంట్ పాసేజ్' కింద ఎవరి అనుమతి లేకుండానే హార్ముజ్ జలసంధి గుండా వెళ్లవచ్చు. కానీ, ఇరాన్ మాత్రం స్పష్టంగా ఒక మాట చెప్తున్నది. యుద్ధానికి ముందున్న విధానాలు పూర్తిగా మారాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరాన్ విధించే




కొత్త షరతులు ఇలా ఉండే అవకాశం ఉన్నది. హార్ముజ్ గుండా వెళ్లే ప్రతి నౌక 72 గంటల ముందే ఇరాన్ కోస్ట్ గార్డ్‌కు సమాచారం ఇచ్చి, అనుమతి తీసుకోవాలి. దీనివల్ల ఏ నౌకలో ఏముందో నిఘా పెట్టే అధికారం ఇరాన్‌కు వస్తుంది. హార్ముజ్ జలసంధిలో భద్రతను ఇరాన్, ఒమన్ మాత్రమే చూస్తాయి.. కాబట్టి వెళ్లే ప్రతి నౌక కొంత మొత్తాన్ని 'సెక్యూరిటీ సర్‌చార్జ్'గా చెల్లించాలని కొత్త ప్రతిపాదన తెచ్చే అవకాశం ఉన్నది. గల్ఫ్ ప్రాంతానికి సంబంధం లేని దేశాల యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకలు ఈ జలసంధిలోకి ప్రవేశించకూడదు.. ఒకవేళ రావాల్సి వస్తే ఇరాన్ నేతృత్వంలోని 'రీజినల్ కౌన్సిల్' అనుమతి తీసుకోవాల్సి ఉంటుం దనేది అన్ని షరతుల్లో కీలకమైనది.. ఇరాన్ చమురును కొనే దేశాల నౌకలకు మాత్రమే ఈ జలసంధిలో 'గ్రీన్ చానల్' కల్పిస్తామని, ఆంక్షలు పాటించే దేశాల నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది.

### సూయజ్.. హార్ముజ్‌కు తేడా

నిజానికి సూయజ్ కాలువ మానవ నిర్మితం. ఇది పూర్తిగా ఈజిప్ట్ భూభాగం గుండా వెళ్తుంది. కాబట్టి, దానిపై ఈజిప్టుకు పూర్తి సార్వభౌమాధికారం ఉంటుంది. ఎవరిని అనుమతించాలి? ఎంత రుసుము వసూలు చేయాలి? అనేది ఈజిప్ట్ ఇష్టం. హార్ముజ్ జలసంధి పూర్తిగా సహజసిద్ధమైన జలమార్గం. పైగా ఇది అంతర్జాతీయ జలసంధి. దీని ఒక వైపు ఇరాన్, మరోవైపు ఒమన్ దేశాలు ఉన్నాయి. దీనిపై ఏ ఒక్క దేశానికీ పూర్తి హక్కు ఉండదు. సముద్ర చట్టాలపై అంతర్జాతీయ ఒప్పందం (ఖఅట్వస చీఛ్ఆశీఅం జశీఅజవఅ్ఱశీఅ శీఅ్ ష్ట్రవ ఞఖ్ష శీట్ ష్ట్రవ వాఖ) ప్రకారం అంతర్జాతీయ జలసంధుల గుండా వెళ్లే నౌకలకు 'నిరంతర, వేగవంతమైన ప్రయాణం' చేసే హక్కు ఉంటుంది. దీనిని ఏ దేశం అడ్డుకోకూడదు, రుసుము వసూలు చేయకూడదు. ఇరాన్ ఈ ఒప్పందంపై సంతకం చేసినా, దానిని పూర్తిగా ఆమోదించలేదు. అందువల్ల, తమ ప్రాంతీయ జలాల గుండా వెళ్లే నౌకలపై నియంత్రణ మాకు ఉండాలని ఇరాన్ వాదిస్తోంది.

### యుద్ధం ముగింపు ఇదేనా?

'ఇరాన్ పెడుతున్న షరతులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. మేము వీటిని అంగీకరించం. అవసరమైతే బల ప్రయోగం చేస్తాం' అని అమెరికా అంటోంది. అమెరికా మొండిగా వెళ్తే ఇరాన్ పూర్తిగా జలసంధిని మూసేస్తుంది. ఫలితంగా చమురు, గ్యాస్ సరఫరా ఆగిపోతే యూరప్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. అందుకే ఇరాన్‌తో చర్చలు జరిపి ఏదో ఒక మధ్యేమార్గం చూడాలని ఆ దేశాలు అమెరికాపై ఒత్తిడి తెస్తున్నాయి. మొత్తానికి పరిస్థితి చూస్తే యూరప్ దేశాలు అమెరికాను ఒప్పించి.. ఇరాన్‌పై ఉన్న కొన్ని ఆర్థిక ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. దీనికి ప్రతిగా ఇరాన్ ప్రతిపాదిస్తున్న 'కొత్త ప్రొటోకాల్' డిమాండ్లలో కొన్ని వెనక్కి తీసుకునేలా ఒప్పందం కూడా కుదిరే అవకాశం ఉన్నది. హార్ముజ్ జలసంధి గొంతుపై ఇరాన్ పెట్టిన కత్తితో యూరప్ సహా ప్రపంచ దేశాలు వణుకుతున్నాయనడంలో సందేహమే లేదు.

# నది పేరు చెప్పి తీరం అమ్ముకుంటున్నారు!

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నది ప్రక్షాళన పేరిట తీరం అమ్మకానికి సర్కార్ ప్రణాళికలు రచిస్తున్నదని నిపుణులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా నది తీరాలలోని భూమి వినియోగమార్పిడి, కాంక్రీట్ నిర్మాణాల వల్ల ఆర్థిక అభివృద్ధి సాధిస్తామని చెప్పడం సరైన విధానం కాదు. నదులు కలిగిన నగరాల్లో మురుగునీటి వ్యవస్థ దశాబ్దాల క్రితమే నిర్మితమై ఉన్నది. సంస్థాగతమైన పరిపాలన, రవాణా, మౌలిక సదుపాయాలు కూడా అభివృద్ధి చెంది ఉన్నాయి. ఇప్పుడు నది ప్రక్షాళన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక వృద్ధి పేరుతో ప్రభుత్వం తెరపైకి తీసుకొస్తున్న ప్రణాళికల ఆంతర్యాలేమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించుకుంటూ తెరపైకి తెచ్చింది. వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టుతో మూసీకి పునరుజ్జీవం కల్పిస్తామని చెప్తున్నది. కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ వివాదంలో చిక్కుకున్నది. మూసీ తీర ప్రాంతాల్లోని ప్రజలను నిర్వాసితులు చేయడం, ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచడం ఇందుకు కారణం. ఇటీవల మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్–(ఎంఆర్‌డీసీఎల్) ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రకారం చూస్తే ఈ ప్రాజెక్టులో కొత్తదనం ఏమీ కనిపించడంలేదు. గండిపేట్–లంగర్‌హౌజ్ కారిడార్ నుంచి తూర్పు–పశ్చిమ రహదారి, గాంధీ సరోవర్ రూపకల్పన, నదీతీరం సుందరీకరణ వరకు ఇవన్నీ గతంలో 1998 నాటి నుంచి ప్రచారంలో ఉన్న ప్రభుత్వాల ప్రతిపాదనలను పోలి ఉన్నాయి. ఇది కొత్త ప్రాజెక్ట్ కాదనేది ప్రధానమైన విషయం. ఇక మారింది ఏంటంటే కేవలం ప్రాజెక్ట్ వ్యయం, కన్సల్టెంట్ కంపెనీ మాత్రమే. ఎంఆర్‌డీసీఎల్ ప్రజెంటేషన్ ప్రకారం కన్సల్టెంట్ కంపెనీ ఫీజు రూ.160 కోట్లు. మరి ఇంత ఫీజు తీసుకున్న కన్సల్టెంట్ కంపెనీ కొత్త ఆలోచనలు ఏమైనా చేసిందా? కొత్త ప్రతిపాదనలు ఏమైనా రూపొందించిందా అంటే అదీ లేదు. ఒకప్పటి పాలకులు తెరపైకి తీసుకొచ్చి వాయిదా వేసిన అదే ప్రాజెక్టును వ్యయం పెంచి మళ్లీ ఖరీదైన ప్యాకేజీగా రూపకల్పన చేశారని స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కొన్ని నిరర్థకమైన వాదనలు, అసత్యాలు గమనించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు నగరాలు, అక్కడి నదుల తీరాల వల్ల ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని చెప్పడం నిరాధారం. వాస్తవాలను గమనిస్తే ఈ వాదన నిలబడదు. కానీ ఇదే అంశాన్ని ప్రజెంటేషన్‌లో ప్రభుత్వం నొక్కి చెప్తూ వచ్చింది. భూమి వినియోగ మార్పిడి, నదీ గర్భంలో కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడం సంపదను సృష్టించే నమూనా గా చూడకూడదు. భూమి విలువ పెంపు, మెరుగైన రవాణా సదుపాయాల కల్పన, ఉద్యోగ కల్పన వికేంద్రీకరణ, వాణిజ్యపరంగా స్థలాలు అందుబాటులో ఉంచే విధానాలు, సమాజంలోని అందరినీ భాగస్వాములు చేయడం, పట్టణ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల ద్వారా మాత్రమే నిజమైన ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుంది. కానీ ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ఇవేమీ కనిపించడంలేదు. పైగా ప్రభుత్వం ప్రస్తావించిన నగరాల జాబితా చూసినా ఎంపిక చేసిన కొన్నింటిని ప్రస్తావించినట్టుగా గమనించవచ్చు. పోనీ ఆయా నదీతీరాల్లో జరిగిన అభివృద్ధిగా చెప్తున్న నమూనా తీరుతెన్నులను పరిశీలించినా కాంగ్రెస్ సర్కార్ వాదన అసంబద్ధమే అనే విషయం స్పష్టమవుతుంది. ప్రజెంటేషన్‌లో పేర్కొన్న సియోల్‌లోని చియాంగ్‌గ్యెచియాన్ తీరం. ఇది పంపింగ్ చేసిన నీరు ప్రవహించే ఒక కాంక్రీట్ చానల్. దీని నిర్వహణ భారం కూడా చాలా అధికం అనే విమర్శలు ఉన్నాయి. పర్యావరణపరంగా ఇదొక డొల్ల ప్రాజెక్టు అని కొరియన్ సంస్థలు తమ అధ్యయనంలో పేర్కొన్నాయి. అంతేకాకుండా ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టిన నగరాల్లో అంతకు దశాబ్దాలకు ముందే మురుగునీటి పారుదల, సంస్థాగతమైన పరిపాలన, రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెంది ఉన్నాయి. అక్కడ నదీ తీర అభివృద్ధి అనేది చివరగా చేపట్టిన ప్రాజెక్టే తప్ప, మొదటగా చేపట్టిన ప్రాజెక్టు కాదు. హైదరాబాద్ విషయానికి వస్తే ఈ క్రమానికి ప్రభుత్వం తిరోగమనంలో వెళ్తున్నట్టుగా కనిపిస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తయితే ఇలా ఉంటుంది అంటూ ప్రభుత్వం చెప్తున్నది కానీ, వాటిని ఎలా నిర్వహిస్తారు? అందుకోసం రూపొందించే వ్యవస్థలు ఏంటి? నిర్వహణ వ్యయం ఎంతో చెప్పడంలేదు. గోదావరి నీటిని తరలించి మూసీలోకి వదులుతామని ప్రభుత్వం చెప్తున్నది. మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా శుద్ధ జలాలను నదిలో నింపడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డ్ అంచనా ప్రకారం 2051 వరకు 62 ఎస్టీపీలు అవసరం. కానీ ప్రభుత్వ ప్రణాళికలో స్పష్టతలేదు. మురుగునీటిపై స్పష్టత ఇవ్వకుండా నదీతీరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడంలో అర్థంలేదు. కానీ మొదటిదశ ప్రాజెక్టుకు రూ.6,500–7,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వ వర్గాల అంచనా. ప్రభుత్వం చెప్తున్న ప్రజెంటేషన్ ద్వారా మనకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. హైదరాబాద్ పరిధిలోని 55 కిలోమీటర్ల పొడవైన నదీతీర అభివృద్ధి ద్వారా లాభాలు కలుగుతాయని ప్రభుత్వం పదేపదే చెప్పుకొస్తున్నది. కానీ ఎవరికి లాభాలు కలుగుతాయి? అనేది ప్రశ్న. దీనికి సమాధానం బహిరంగ రహస్యమే. ఇక మూసీ ప్రాజెక్టులో భాగంగా జీవో ఆర్టీ నంబర్ 921 ద్వారా ప్రభుత్వం 46 కాలనీలను తొలగించాలని భావిస్తున్నది. అంతేకాకుండా ఇండ్లను కూల్చడం, ప్రజలను అక్కడి నుంచి తరలించడం కోసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కూడా చేపట్టకూడదని నిర్ణయించింది. అప్పుల భారంతో ఉన్న ఒక రాష్ట్ర ప్రభుత్వం నదీతీర అభివృద్ధి ద్వారా అక్కడి భూముల విలువ పెంచుతామని చెప్పినా అది పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధిగా పరిగణనలోకి తీసుకునే పరిస్థితి ఉండదు.

# కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడీ...

### ఒక ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్...!

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు...



హైదరాబాద్//మర్చి 20(ఆకాంక్ష ) : తెలంగాణ అసెంబ్లీలో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్ నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా, ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత ఏడాది కంటే రూ. 1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా, ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా కేవలం 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13%), బీహార్ (21%) తమ బడ్జెట్‌లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. 'ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు' అని గొప్పలు చెప్పడం తప్ప, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు. ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందని నిలదీశారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం, పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాళా తీయించడమేనని హెచ్చరించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా 'ఫ్యూచర్ సిటీ' అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్రంలోని నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు, 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్ (===), దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముగ్నరేగా స్థానంలో, 'వికసిత భారత్-2047' దార్శనికతకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ రోజ్ గార్ అజీవికా మిషన్ గ్రామీణ వీబీ గ్రామ్ జి చట్టం2025ను తీసుకువచ్చింది. ఈ నూతన చట్టం ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూపాయికి రూపాయి అందుతుందని ఆయన వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ గారే స్వయంగా కేంద్రం రూపాయి పంపిస్తే.. లబ్ధిదారులకు చేరేసరికి 15 పైసలు మాత్రమే మిగులుతున్నాయని అన్నారని గుర్తు చేస్తూ, నేడు నరేంద్ర మోదీ గారి పాలనలో ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పంపే ప్రతి పైసా నేరుగా పేదవాడి ఖాతాకే చేరుతోందని అన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఐదు దఫాలుగా రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా, సరిగ్గా ఇవ్వకుండా.. ఇంకా ప్రతి రైతుకు ఇంకా సుమారు ఎకరాకు రూ. 45,000 కి పైగా బాకీ పడి ఎగ్గొట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ. 4000 నిరుద్యోగ భృతి కానీ, మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఆర్థిక సాయం గురించి కానీ ఈ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్‌లో చోటు లేకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు. కాంగ్రెస్ సర్కారు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ ఢిల్లీలో తుర్క్మాన్ గేట్ వద్ద పేదల ఇళ్లు కూలగొట్టిన 'మైండ్ సెట్' తోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం రెండు రోజుల్లోనే రూ. 5000 కోట్ల నుండి రూ. 7000 కోట్లకు ఎలా పెరిగిందని రాంచందర్ రావు నిలదీశారు. ఇదంతా ఒక ప్లానింగ్ లేని విధానమని, కేవలం దోచుకోవడానికేనని ఆరోపించారు. దేవాలయాల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అర్చకుల వేతనాలు పెంచాలని, ధూప దీప నైవేద్యాలకు బడ్జెట్ పెంచాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా, కేవలం మైనారిటీ బడ్జెట్‌ను రూ. 700 కోట్లు పెంచడం ఓటు బ్యాంక్ పాలిటిక్స్ లో భాగమేనన్నారు. హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేసి జీహెచ్ఎంసికి బడ్జెట్ కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఓవరాల్‌గా ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పేదలకు దూరంగా ఉన్న ఈ 'ఫెయిల్డ్ బడ్జెట్' ను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని రాంచందర్ రావు గారు స్పష్టం చేశారు.

## 2025-26లో భారత వృద్ధి రేటు 7.3 శాతం అంచనాలను పెంచిన ఐఎంఎఫ్

### భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ కీలక అంచనా- ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఇండియా కొనసాగుతుందన్న ఐఎంఎఫ్




రాబోయే రెండేళ్లలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. అలాగే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూడా గ్రోత్ రేటు ఊహించిన దానికంటే వేగంగా పుంజుకుంటోందని అభిప్రాయపడింది. సోమవారం విడుదల చేసిన తన తాజా 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో భారత వృద్ధి రేటుపై కీలక విషయాలను వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలకు మించి నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. దీంతో వృద్ధి రేటును 7.3 శాతానికి పెంచింది. గతేడాది అక్టోబర్‌లో ఇచ్చిన అంచనా కంటే ఇది 0.7 శాతం ఎక్కువ. అలాగే, 2026- 27 ఆర్థిక సంవత్సరానికి గాను వృద్ధి రేటును 6.2 శాతం నుంచి 6.4 శాతానికి సవరించింది. 2027-28లో మాత్రం అనుకూలతలు తగ్గుముఖం పట్టడంతో వృద్ధి 6.4 శాతం వద్ద స్థిరపడవచ్చని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా రాణించిందని, నాలుగో త్రైమాసికంలోనూ అదే జోరు కొనసాగడంతో ఐఎంఎఫ్ అంచనాలను సవరించింది. ఇదిలా ఉండగా, 2025-26 ఏప్రిల్-సెప్టెంబర్ త్రైమాసికంలో 8 శాతం, జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో అత్యధికంగా 8.2 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు భారత గణాంక మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో ఆహార ధరలు అదుపులోకి వస్తుండటంతో 2025 నాటికి ద్రవ్యోల్బణం సాధారణ స్థాయికి చేరుకుంటుందని ఐఎంఎఫ్ చెప్పింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించుకున్న 4 శాతం లక్ష్యానికి అనుగుణంగానే ధరలు ఉండే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది.

### గ్లోబల్ వృద్ధి రేటు

ప్రపంచ ఆర్థిక వృద్ధిపై కూడా ఐఎంఎఫ్ కీలక అంచనాలను వెల్లడించింది. 2026లో 3.3 శాతంగా, 2027లో 3.2 శాతంగా ఉంటుందని పేర్కొంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా 2025-26లో వృద్ధి రేటును 5 శాతానికి సవరించింది. గతంలో కంటే 0.2 శాతాన్ని పెంచింది. అమెరికా టారిఫ్‌లో నేపథ్యంలో చైనా మార్కెట్ వేగంగా పుంజుకోవడంతో ఈ మేరకు ఐఎంఎఫ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం 2025లో 4.1 శాతం ఉంటే, 2027 నాటికి అది 3.4 శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య విధానాల్లో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, సాంకేతిక రంగంలో ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ)కి సంబంధించి పెరుగుతున్న పెట్టుబడులు గ్లోబల్ గ్రోత్ కు బలాన్నిస్తున్నాయని ఐఎంఎఫ్ పేర్కొంది. ఉత్తర అమెరికా, ఆసియా ప్రాంతాల్లో ఈ పెట్టుబడుల ప్రభావం ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా కనిపిస్తోందని తెలిపింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధి అంచనాల పెంపులో అమెరికా ముందంజలో నిలిచింది. 2026 సంవత్సరానికి అమెరికా ఆర్థిక వృద్ధి రేటును 2.4 శాతంగా ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇది క్యూ2 అంచనాలతో పోలిస్తే 30 బేసిస్ పాయింట్లు ఎక్కువ. 2027 సంవత్సరానికి అమెరికా వృద్ధి అంచనాను స్వల్పంగా తగ్గిస్తూ 2 శాతంగా నిర్ణయించింది. ఇది 2026తో పోలిస్తే 10 బేసిస్ పాయింట్లు తక్కువ అని ఐఎంఎఫ్ వెల్లడించింది. 2026 సంవత్సరానికి చైనా వృద్ధి అంచనాను 30 బేసిస్ పాయింట్లు పెంచి 4.5 శాతంగా ప్రకటించింది. అయితే, 2027 సంవత్సరానికి చైనా వృద్ధి రేటు 4 శాతంగా ఉంటుందని పేర్కొంది. ఇది గత అంచనాలతో పోలిస్తే 20 బేసిస్ పాయింట్లు తక్కువ. గ్లోబల్ స్థాయిలో ఆర్థిక విధానాలపై అనిశ్చితి 2026 వరకూ అధికంగానే ఉంటుందని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది.

## గంభీర్ కోచింగ్‌లో టీమ్ఇండియాకు 5 చేదు జ్ఞాపకాలు- ఫ్యాన్స్‌ను నిరాశపరుస్తున్న ఆ చెత్త రికార్డులు ఇవే!

### గౌతమ్ గంభీర్ కోచింగ్ పీరియడ్ లో ఊహించని ఫలితాలు, ఘోర ఓటములు- అన్ని వేళ్లు అతడివైపే- తీవ్ర ఒత్తిడిలో గంభీర్!




టాలెంటెడ్ ఆటగాళ్లు, ఎంతో అనుభవం ఉన్న సీనియర్లతో కళకళలాడే భారత జట్టుకు ఇప్పుడు కాలం కలిసి రావడం లేదు. ముఖ్యంగా గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి టీమ్ఇండియా ఊహించని రీతిలో ఘోరమైన ఓటములను చవిచూస్తోంది. మొన్న ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ చేతిలో 41 పరుగుల తేడాతో ఓడిపోవడమే దీనికి నిదర్శనం. విరాట్ కోహ్లీ సెంచరీతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. గంభీర్ హయాంలో భారత్ ఎదుర్కొన్న ఆ 5 చేదు జ్ఞాపకాలు ఏంటి అనే వివరాల్లోకి వెళితే..

### చరిత్రలోనే మొదటిసారి ఇలా

టీమ్ఇండియా చరిత్రలోనే న్యూజిలాండ్ జట్టు మన దేశానికి వచ్చి వన్డే సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1988 నుంచి 2023 వరకు కివీస్ టీమ్ భారత్‌లో ఏడు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడితే ఏడింటిలోనూ ఓడిపోయింది. కానీ ఈసారి మాత్రం వారు 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుని గంభీర్ కోచింగ్‌లో భారత్‌కు మొదటి దారుణమైన పరాభవాన్ని మిగిల్చారు. అసలు ఇలాంటి రీతిలో సిరీస్ చేజారుతుందని ఎవరూ ఊహించలేదు. జట్టు మంచి ఫామ్‌లో ఉన్నట్లు అనిపిస్తున్నా ఫలితం మాత్రం దారుణంగా ఉంటోంది.

### టెస్ట్ సిరీస్‌లో వైట్‌వాష్

నవంబర్ 2024లో న్యూజిలాండ్ జట్టు భారత్‌లో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. కనీసం మూడు మ్యాచులు ఉన్న టెస్ట్ సిరీస్‌లో భారత్ తన సొంత గడ్డపై వైట్‌వాష్ అవ్వడం ఇదే తొలిసారి. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో భారత్ కేవలం 46 పరుగులకే ఆలౌట్ అవ్వడం కూడా గంభీర్ హయాంలోనే జరిగింది. టాప్ ప్లేయర్స్ అందరూ ఒకేసారి ఫామ్ కోల్పోవడం కూడా పెద్ద షాక్ అనే చెప్పాలి. బ్యాటింగ్ లైనప్‌లో క్లారిటీ లేకపోవడం ఈ పరాభవానికి ప్రధాన కారణమని కొందరు సీనియర్లు కామెంట్ చేశారు.

### డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి దాదాపు దూరం!

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన రెండు ఎడిషన్లలోనూ భారత్ ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. కానీ గంభీర్ కోచ్‌గా ఉన్నఈ సమయంలో 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ కు దాదాపు దూరమైంది. న్యూజిలాండ్‌తో జరిగిన 3-0 ఓటమి, ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం వల్ల భారత్ ఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో 48.15 పాయింట్ పర్సెంటేజీతో ఆరో స్థానంలో ఉంది. ఇకపై భారత్ ఇంకా తొమ్మిది టెస్టులు (శ్రీలంకతో 2, న్యూజిలాండ్ తో 2, ఆస్ట్రేలియాతో 5) ఆడాల్సి ఉంది. ఈ సిరీస్ ల్లో వరుస విజయాలు నమోదు చేస్తే 74.07 పర్సెంటేజీకి చేరుకుంటుంది. అప్పుడు ఫైనల్ చేరేందుకు అవకాశాలు ఉంటాయి. కానీ ఇది జరగడం అంత సులభం కాదు! అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కు డిమాండ్ పెరుగుతున్న క్రమంలో టీమ్ఇండియా నుంచి ఇలాంటి ప్రదర్శన ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది.

### శ్రీలంకతో 27 ఏళ్ల తర్వాత సిరీస్ ఓటమి

ఆగస్టు 2024లో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2-0తో కోల్పోయింది. గత 27 ఏళ్లలో శ్రీలంక చేతిలో భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1997లో శ్రీలంక చేతిలో ఓడిపోయిన భారత్, ఆ తర్వాత వరుసగా 13 సిరీస్‌లలో ఓటమి లేకుండా దూసుకుపోయింది. కానీ గంభీర్ రాకతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. శ్రీలంక ఇతర చిన్న జట్లతో ఓడిపోతున్న సమయంలో భారత్‌ను ఓడించడం పెద్ద షాక్ అనే చెప్పాలి.


### బోర్డర్ గావస్కర్ ట్రోఫీ చేజారడం

గడిచిన పదేళ్లలో భారత్ ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా చేతిలో బోర్డర్ గావస్కర్ ట్రోఫీని కోల్పోలేదు. 2018-19 అలాగే 2020-21 లో ఆస్ట్రేలియా గడ్డపైనే వారిని ఓడించి వరుసగా నాలుగుసార్లు ట్రోఫీని నిలబెట్టుకుంది. అయితే 2024-25 లో గంభీర్ కోచింగ్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్ 3-1తో సిరీస్‌ను కోల్పోయి, పదేళ్ల తర్వాత ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించింది. గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాత జట్టులో ఆ దూకుడు తగ్గిందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ ఐదు ఘోర పరాభవాలు కూడా జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. మరి రాబోయే టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీల్లోనైనా టీమ్ఇండియా ఈ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తుందో లేదో వేచి చూడాలి.

## డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం..

## గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి

### డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది.



డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం.. గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది. ఒకప్పుడు జనాభాలో ప్రపంచంలో అన్ని దేశాలకంటే చైనా టాప్ లో ఉండేది. కానీ గతేడాది జులై1 జనాభా లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల లిస్టులో భారత్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. చైనా రెండోస్థానానికి పడిపోయింది. 2022లో చైనా మొదటి స్థానంలో ఉండగా.. మూడేళ్లుగా రెండోస్థానంలోనే కొనసాగుతోంది. 2024లో నమోదైన జనాభా సంఖ్యతో పోలిస్తే 2025లో జననాల సంఖ్య 17 శాతం తక్కువగా నమోదైందని అక్కడి గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది అక్కడ జననాల సంఖ్య 79.2 లక్షలుగా నమోదయింది. ఆసియా ఖండంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే.. చైనాలో సంతానోత్పత్తి రేటు రోజురోజుకూ తగ్గుతోందని, ఇది దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చైనా ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. చైనాలో పిల్లల్ని కనేందుకు జంటలు వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. అక్కడి ప్రజల జీవన ఖర్చులు పెరగడమే. పిల్లల పెంపకం చాలా ఎక్స్పెన్సివ్ కావడంతో కనకపోవడమే మంచిదని భావిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ చదువుకి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సరాసరి 76 వేల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.69 లక్షలు ఖర్చవుతున్నట్లు ఒక అంచనా ఉంది. అందుకే పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. పెళ్లయిన వాళ్లు పిల్లల్ని కనాలంటే ఖర్చు గురించి ఆలోచిస్తున్నారు. ఈ ఆలోచన ధోరణిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే కండ్రోమ్స్, గర్భనిరోధక మాత్రలపై 13 శాతం పన్ను విధించింది. నర్సరీ నుంచి కిండర్ గార్టెన్స్ వరకూ, వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలు.. వంటివాటిపై ఈ ఏడాది జనవరి 1 నుంచి పన్నును మినహాయించింది.ద

## ట్రంప్ సుంకాల నడుమ చైనా పురోగతి- ఎగుమతుల్లో దూకుడు- 2025లో 5 శాతం వృద్ధి


### 2025లో ఐదు శాతం వృద్ధిని సాధించిన చైనా ఆర్థిక వ్యవస్థ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నడుమ కూడా చైనా పురోగతిని నమోదు చేసింది. 2025లో చైనా ఆర్థిక వ్యవస్థ 5 శాతం వృద్ధిని సాధించింది. ఓ వైపు ట్రంప్ సుంకాలున్నా, మరోవైపు చైనా ఎగుమతి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా ముందుకు సాగడంతో ఈ వృద్ధి సాధ్యమైంది. అయితే 2025 సంవత్సరం చివరి త్రైమాసికం (అక్టోబరు - డిసెంబరు)లో తమ ఆర్థిక వ్యవస్థ వృద్ధి కొంత మందగించి 4.5 శాతానికి తగ్గిందని చైనా ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. కరోనా సంక్షోభం ప్రభావంతో చివరిసారిగా 2022 సంవత్సరంలో చైనా ఆర్థిక వృద్ధి తగ్గిందని తెలిపింది. అదే తరహా మందగమనాన్ని 2025 సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ చూశామని పేర్కొంది. 2024 అక్టోబరు - డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే, 2025లో అదే త్రైమాసికంలో సగటున 4.8 శాతం వార్షిక వృద్ధి రేటును సాధించామని చైనా సర్కారు వెల్లడించింది.

### కొనుగోలు శక్తి, పెట్టుబడులు క్షీణించాయ్ కానీ

కరోనా సంక్షోభ కాలం నాటి నుంచే చైనా ఆర్థిక వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. గత కొన్నేళ్లుగా చైనా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సంక్షోభం ఉంది. ఈనేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకోవడానికి చైనా ప్రభుత్వం ప్రత్యేక చర్యలను అమలు చేసిందని నెదర్లాండ్స్‌కు చెందిన ఐఎన్‌జీ బ్యాంకులో గ్రేటర్ చైనా విభాగం ప్రధాన ఆర్థికవేత్తగా వ్యవహరిస్తున్న లిన్ సాంగ్ పేర్కొన్నారు. అయితే ఆర్థిక వ్యవస్థలో దిద్దుబాట్లు చేసే దిశగా చైనా సర్కారు చర్యలు ఎంతకాలం పాటు కొనసాగుతాయి? అవి ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ఎంతమేరకు పెంచుతాయి? అనేది వేచి చూడాల్సి ఉందన్నారు. చైనా ప్రజల కొనుగోలు శక్తి తగ్గినా, వ్యాపార పెట్టుబడులు క్షీణించినా, కేవలం ఎగుమతులు గణనీయంగా పెరిగినందు వల్లే 2025లో 5 శాతం ఆర్థిక వృద్ధి సాధ్యమైందని లిన్ సాంగ్ చెప్పారు. 2025లో చైనాలోకి వచ్చిన దిగుమతుల కంటే చైనా నుంచి వెళ్లిన ఎగుమతుల విలువ రూ.108 లక్షల కోట్లు (1.2 ట్రిలియన్ డాలర్లు) ఎక్కువగా ఉందని ఆయన గుర్తు చేశారు. 2025లో 5 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న చైనా ప్రభుత్వం, మొత్తం మీద దాన్ని సాధించడంలో సఫలమైందన్నారు.

### ఎగుమతులు అమెరికాకు డౌన్, ఇతర దేశాలకు అప్



2025లో చైనాపై అమెరికాలోని ట్రంప్ సర్కారు దిగుమతి సుంకాలను పెంచింది. దీనివల్ల అమెరికాకు చైనా వస్తు,ఉత్పత్తుల ఎగుమతి గణనీయంగా తగ్గింది. దీంతో ప్రపంచంలోని ఇతర దేశాల మార్కెట్లపై చైనా ఫోకస్ పెట్టింది. అక్కడికి తన ఎగుమతులను పెద్దసంఖ్యలో పంపింది. తద్వారా ఎగుమతుల్లో తమ స్పీడు ఏమాత్రం తగ్గకుండా చైనా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ఇక ఇదే సమయంలో చైనా నుంచి భారీగా ఎగుమతులు పోటెత్తడాన్ని పలు ప్రపంచ దేశాలు తమ దేశీయ పరిశ్రమలకు ముప్పుగా పరిగణించాయి. ఆయా దేశాలు చైనా వస్తు, ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పెంచాయి. గతేడాది ఈ కారణం వల్లే చైనాపై మెక్సికో దిగుమతి సుంకాలను పెంచింది.

### చైనాపై మరిన్ని దేశాల సుంకాలు ?

'మెక్సికో బాటలోనే మరిన్ని దేశాలు చైనా వస్తు, ఉత్పత్తులపై సుంకాలను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ దిశగా యూరోపియన్ యూనియన్ నుంచి చైనాకు హెచ్చరిక వచ్చింది. ఈనేపథ్యంలో చైనా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు మొదలుపెట్టింది. చైనాలోనే దేశీయంగా వస్తు, ఉత్పత్తుల వినియోగాన్ని పెంచే దిశగా కసరత్తును పెంచింది. ఇందుకోసం విడతలవారీగా విధానపరమైన మార్పులు చేస్తోంది. అయితే ఈ విధానపరమైన చర్యలు అంత ప్రభావవంతంగా పనిచేయకపోవచ్చు. డ్రైవర్లు పాత కార్లను ఇచ్చి, అధిక మైలేజీని ఇచ్చే కొత్త కార్లను తీసుకోవాలనే ప్రత్యేక కార్యక్రమాన్ని చైనా ప్రభుత్వం అమలు చేస్తోంది. గత కొన్ని నెలలుగా దానికి ఎలాంటి ఆదరణ లభించడం లేదు' అని నెదర్లాండ్స్‌కు చెందిన ఐఎన్‌జీ బ్యాంకులో గ్రేటర్ చైనా విభాగం ప్రధాన ఆర్థికవేత్తగా వ్యవహరిస్తున్న లిన్ సాంగ్ పేర్కొన్నారు.

### గృహోపకరణాల కొనుగోలుపై చైనా భారీ సబ్సిడీలు

'అంతర్జాతీయ మార్కెట్‌లోని అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వినియోగాన్ని పెంచడంపై చైనా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. 2025లోనూ ఈ దిశగా చాలా పాలసీలను అమలు చేసింది. గృహోపకరణాల కొనుగోలుపై భారీ సబ్సిడీలను ప్రకటించింది. ఈ ఏడాది కూడా ఆ సబ్సిడీలను కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. తద్వారా తమ దేశంలో రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, టీవీల వంటి ఉత్పత్తుల విక్రయాలను పెంచాలని చైనా ప్రభుత్వం భావిస్తోంది' అని అమెరికాకు చెందిన ప్రైవేటు బ్యాంక్ జేపీ మోర్గాన్ అంతర్జాతీయ పెట్టుబడుల విభాగం వ్యూహకర్త వీహెంగ్ చెన్ విశ్లేషించారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. ఒకేరోజు రెండుసార్లు!

### ఆకాశమే హద్దుగా బంగారం ధరలు దూసుకెళ్తున్నాయి.




ఆకాశమే హద్దుగా బంగారం ధరలు దూసుకెళు_న్నాయి. మనల్ని ఎవడ్రా ఆపేది అనేలా.. ఇవాళ మరోసారి ఆల్ టైమ్ హైని టచ్ చేశాయి. ఉదయం లక్షా 47 వేలకు పైగా ఉన్న ధరలు.. సాయంత్రానికి లక్షా 52 వేలకు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.1,52,000(జీఎస్టీతో కలిపి)లు దాటింది. దీంతో పాటు సిల్వర్ రేట్లు కూడా పరుగులు పెడుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో కిలో సిల్వర్ ధర రూ.3,39,900(3శాతం జీఎస్టీతో కలిపి) పైనే పలుకుతోంది. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో.. సంక్షోభ సమయంలో సురక్షిత పెట్టుబడి సాధనాలుగా బంగారం, వెండికి విపరీతమైన డిమాండ్ నెలకొంది. దీంతో వీటిపైకి విస్తృతంగా పెట్టుబడులు వస్తుండగా.. ధరలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే సరికొత్త రికార్డుల్ని సృష్టిస్తున్నాయి. తాజాగా మరోసారి దేశీయంగా, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఆల్ టైమ్ హైకి చేరడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

# కెప్టెన్లు మారుతున్నా మారని రాత

# పంజాబ్, ఢిల్లీ ఎన్నిసార్లు లీడర్‌ను మార్చాయో తెలుసా

### ఐపీఎల్ 19 సీజన్లలో పంజాబ్ కింగ్స్ రికార్డు స్థాయిలో కెప్టెన్ల మార్పు- ఢిల్లీ క్యాపిటల్స్ కూడా దాదాపు అంతే- లీడర్‌షిప్‌లో నిలకడ లేకపోవడమే వైఫల్యానికి కారణమా




ఐపీఎల్ వచ్చిన తరువాత ప్రపంచ క్రికెట్ లో చాలా రాకల మార్పులు వచ్చాయి. అయితే ఈ 19ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని జట్లు కప్పుల మీద కప్పులు గెలుస్తుంటే, మరికొన్ని జట్లు మాత్రం ఇంకా 'ఈసారి కప్పు కొట్టాలి' అనే నినాదంతోనే సరిపెట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ (గాదీఖా), ఢిల్లీ క్యాపిటల్స్ (ఞజ) జట్లు ఈ జాబితాలో ముందు వరుసలో ఉంటాయి. ఈ రెండు జట్లలో ఆటగాళ్లు మారుతున్నారు, కోచ్‌లు మారుతున్నారు, అన్నింటికంటే ముఖ్యంగా కెప్టెన్లు రికార్డు స్థాయిలో మారుతున్నారు. కానీ, ఆఖరి మెట్టు మీద మాత్రం ఈ జట్లు బోల్తా పడుతూనే ఉన్నాయి. ఇక కెప్టెన్సీలలో ఎలాంటి మార్పులు చేశారు? ఎన్నిసార్లు మారారు అనే వివరాల్లోకి వెళితే!

సమస్య ఎక్కడ మొదలైంది

ఐపీఎల్ లో సక్సెస్ ఫుల్ టీమ్స్ అయిన సీఎస్‌కే, ముంబయి జట్లను గమనిస్తే వాటిలో కెప్టెన్సీ విషయంలో ఒక స్పష్టమైన నిలకడ కనిపిస్తుంది. కానీ పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు దీనికి పూర్తి విరుద్ధం. గడిచిన 19 సీజన్లలో పంజాబ్ కింగ్స్ ఏకంగా 17 సార్లు కెప్టెన్సీలో మార్పులు చేసింది. ఐపీఎల్ లో అత్యధిక సార్లు కెప్టెన్లను మార్చిన జట్టుగా పంజాబ్ నిలిచింది. మరోవైపు ఢిల్లీ కూడా దాదాపు 13 మంది సారథులను మారుస్తూ ప్రయోగాలు చేసింది.

పంజాబ్ కెప్టెన్ల కథ

పంజాబ్ జట్టులోకి వచ్చిన కెప్టెన్ల జాబితా చూస్తే అంతా హేమాహేమీలే కనిపిస్తారు. యువరాజ్ సింగ్‌తో మొదలైన ఈ ప్రస్థానం కుమార్ సంగక్కర, మహేల జయవర్ధనే, ఆడమ్ గిల్‌క్రిస్ట్, జార్జ్ బెయిలీ, గ్లెన్ మాక్స్‌వెల్, రవిచంద్రన్ అశ్విన్, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్ వరకు చేరుకుంది. వీరితో పాటు మధ్యలో పలువురు కెప్టెన్లు కూడా బాధ్యతలు చేపట్టారు. ఇంతమంది దిగ్గజాలు జట్టును నడిపించినా, లాంగ్ రన్ లో జట్టును నిలకడగా విజయ తీరాలకు చేర్చడంలో మాత్రం యాజమాన్యం విఫలమవుతూనే వచ్చింది.

పంజాబ్ కింగ్స్ చరిత్రలో చెప్పుకోదగ్గ సీజన్లు 3 మాత్రమే ఉన్నాయి. 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్ లో యువరాజ్ సింగ్ సారథ్యంలో ఆ జట్టు సెమీఫైనల్ కు చేరి ఆశలు రేకెత్తించింది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి ప్రదర్శన 2014లో కనిపించింది. జార్జ్ బెయిలీ కెప్టెన్సీలో మాక్స్‌వెల్, మిల్లర్, సెహ్వాగ్ వంటి స్టార్ ఆటగాళ్లతో కూడిన పంజాబ్ జట్టు ఫైనల్ వరకు వెళ్లి రన్నరప్ గా నిలిచింది. ఇక గత ఏడాది సీజన్ లో ఫైనల్ వరకు వెళ్లి ఆర్సీబీ చేతిలో ఓటమి చెందింది. శ్రేయస్ అయ్యర్ రాకతో జట్టులో కొంత కాన్ఫిడెన్స్ పెరిగింది. ఈ 3 సీజన్లు మినహాయిస్తే పంజాబ్ ప్రదర్శన ఎప్పుడూ అభిమానులకు నిరాశనే మిగిల్చింది. ఢిల్లీ కెప్టెన్ల మార్పులు- ప్రయోగాలు ఎక్కువ ఢిల్లీ క్యాపిటల్స్ (గతంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్) కూడా కెప్టెన్ల మార్పులలో పంజాబ్ కు తక్కువేమీ కాదు. వీరేంద్ర సెహ్వాగ్ తో మొదలుపెట్టి గౌతమ్ గంభీర్, దినేష్ కార్తీక్, కెవిన్ పీటర్సన్, జేపీ డుమిని, జహీర్ ఖాన్, కరుణ్ నాయర్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్,ేవిడ్ వార్నర్ వంటి ఎందరో ఆటగాళు ఈ జట్టుకు నాయకత్వం వహించారు. అయితే ఒక కెప్టెన్ కు జట్టును నిర్మించుకోవడానికి తగినంత సమయం ఇవ్వకుండానే మార్పులు చేయడంతో ఢిల్లీ జట్టు ఎప్పుడూ కొత్త ప్రయోగాలకే పరిమితమైంది.

ఢిల్లీకి వచ్చిన మంచి దశలు

కెప్టెన్ల మార్పులు ఎక్కువగా ఉన్నా, ఢిల్లీ జట్టు అప్పుడప్పుడు మెరుపులు మెరిపించింది. 2008, 2009 సీజన్లలో సెహ్వాగ్ సారథ్యంలో వరుసగా సెమీఫైనల్స్ కు చేరిన ఢిల్లీ, 2012లో జయవర్ధనే నేతృత్వంలో ప్లేఆఫ్స్ కు అర్హత సాధించింది. ఇక శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ గా ఉన్నప్పుడు కూడా ఢిల్లీ దశ మారింది. 2019లో ప్లేఆఫ్స్, 2020లో ఫైనల్ కు చేర్చి జట్టును బలంగా నిలిపాడు. ఆ తర్వాత 2021లో రిషబ్ పంత్ సారథ్యంలోనూ జట్టు ప్లేఆఫ్స్ కు చేరింది. కానీ ఆ తరువాత ఈ జట్టు మేనేజ్మెంట్ శ్రేయస్ అయ్యర్, పంత్ ఇద్దరిని వదిలేసుకోవడం అతిపెద్ద పొరపాటు. అయితే పంజాబ్ తో పోలిస్తే ఢిల్లీకి సక్సెస్ రేటు కొంచెం ఎక్కువే ఉన్నా, ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది.

అసలు సమస్య

నిజానికి కెప్టెన్లను మార్చడం అనేది కేవలం పైకి కనిపించే సమస్య మాత్రమే. అసలు లోపం బలమైన టీమ్ ను నిర్మించుకోవడంలో ఉంది. పంజాబ్ జట్టు ప్రతీ వేలంలో దాదాపు జట్టును మార్చేస్తూ జట్టులో నిలకడ లేకుండా చేస్తోంది. ఢిల్లీలో స్టార్ ఆటగాళ్లు ఆడినా, వాళ్లను ఎక్కువ సీజన్లలో ఫ్రాంచైజీలో కొనసాగించలేదు. సీఎస్‌కే, ముంబయి జట్లు అలా కాదు. తమ స్టార్ ఆటగాళ్లను దాదాపుగా కొనసాగించే ప్రయత్నమే చేస్తాయి. అదే వారి సక్సెస్ సీక్రెట్. నాయకత్వం ఒక్కటే మ్యాచ్ లను గెలిపించదు, ఆ నాయకుడికి అండగా ఉండే బలమైన ఆటగాళ్లు లేకపోవడమే ఈ రెండు జట్లకు శాపంగా మారింది.

2026లో పరిస్థితి మారుతుందా

ఐపీఎల్ 2026 సీజన్ లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ బలంగానే బరిలోకి దిగుతున్నాయి. పంజాబ్ కింగ్స్ జట్టును శ్రేయస్ మళ్లీ అయ్యర్ నడిపించనుండగా, రిక్కీ పాంటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ బాధ్యతలను అక్షర్ పటేల్ చేపట్టాడు. ఈ జట్టుకు హేమాంగ్ బదాని కోచ్‌గా ఉన్నారు. ఈసారైనా ఈ జట్లలో నిలకడను తీసుకువస్తాయా అనేది చూడాలి!

# సన్‌రైజర్స్ కాంట్రవర్సీలోకి లలిత్ మోదీ ఎంట్రీ

# పాక్ ప్లేయర్ ను కొన్నందుకు 'కాల్ మీ' అంటూ పోస్ట్!

### కావ్యామారన్ కు లలిత్ మోదీ మెసేజ్- సన్ రైజర్స్ వివాదంలోకి ఐపీఎల్ మాజీ ఛైర్మన్- ఏమన్నారంటే



ఇంగ్లాండ్ డొమెస్టిక్ లీగ్ 'ది హండ్రెడ్'లో పాకిస్థాన్ కు చెందిన ఆటగాడిని సన్ రైజర్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడంపై ఇంకా వివాదం కొనసాగుతూనే ఉంది. ఆ ఫ్రాంచైజీ యజమాని కావ్యామారన్ చర్యలతో టీమ్‌ఇండియా ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారు. దీనిపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త లలిత్ మోదీ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేశారు. ఇటీవల ది హండ్రెడ్ లీగ్ కు సంబంధించి జరిగిన వేలంలో పాక్ బౌలర్ అబ్రార్ అహ్మద్ ను సన్ రైజర్స్ లీడ్స్ జట్టు 1,90,000 పౌండ్లకు (సుమారు రూ. 2.34 కోట్లు) కొనుగోలు చేసింది. అయితే భారత్- పాకిస్థాన్ మధ్య ఉన్న ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ నుంచి దాయాది దేశం ఆటగాళ్లను ఎప్పుడో బ్యాన్ చేశారు. అలాగే ఐపీఎల్ కు చెందిన ఫ్రాంచైజీలు సైతం విదేశీ లీగ్‌లలో పాకిస్థానీ ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపవు. కానీ, సన్‌రైజర్స్ కొనుగోలు చేయడంతో ఇది హాట్ టాపిక్‌గా మారింది. దీనిపైనే కావ్యా మారన్ కు ఏదో సలహా ఇస్తున్నట్లు లలిత్ మోదీ ట్వీట్ చేశారు. మీ! 'పాకిస్థాన్ ఆటగాడిపై రూ.2.34 కోట్ల పెట్టుబడి పెట్టడంతో అభిమానులు ఇప్పటికే ఆగ్రహంతో ఉన్నారు కదా. ఇలాంటి సమయంలోనే పరిస్థితులను ఎలా మేనేజ్ చేయాలి? మళ్లీ మన సామ్రాజ్యాలను ఎలా నిర్మించుకోవాలో నాకు బాగా తెలుసు. కాల్ మీ ' అని లలిత్ మోదీ ఎక్స్ లో పోస్టు చేశారు. అయితే ఇందులో కావ్య పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. కానీ ఈ పోస్టుకు ది హండ్రెడ్ లీగ్, సన్ రైడర్స్ లీడ్స్ ఎక్స్ అకౌంట్ లను మెన్షన్ చేయడంతో ఇది పాక్ ఆటగాడిని కొనుగోలు చేయడంపైనే అని క్లారిటీ వచ్చింది. అయితే తనకు సంబంధం లేకున్నా ఏదో కాంట్రవర్సీలతో లలిత్ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇప్పుడు తాజా పోస్టు చేయడంతో కావ్యకు 'ఉచిత సలహా' ఇస్తున్నారంటూ నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ పన్ను ఎగవేతకు సంబంధించి కేసులు ఉన్నాయి. అలాగే ఐపీఎల్ కు సంబంధించి బ్రాడ్ కాస్టింగ్ హక్కుల కేటాయింపులో ఆయన లాభం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉంటున్నారు. సన్ రైజర్స్ లీడ్స్ జట్టు హ్యారీ బ్రూక్ (కెప్టెన్), మిచెల్ మార్ష్, అబ్రార్ అహ్మద్, నాథన్ ఎల్లిస్, బ్రైడాన్ కార్స్, ర్యాన్ రికెల్టన్ (బ్యాటర్/వికెట్ కీపర్), జాక్ క్రాలీ, మాథ్యూ పాట్స్, డాన్ లారెన్స్, బెన్ హోవెల్, టామ్ లాస్, టామ్ అల్సోప్, రీస్ టోప్లీ, ఎడ్వర్డ్ బర్నార్డ్

# ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే షాక్- స్టార్ ప్లేయర్లు దూరం- రాజస్థాన్, ఢిల్లీ, SRH జట్లకు భారీ ఎదురుదెబ్బ!







### ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ సీజన్ కు దూరమే ఢిల్లీ క్యాపిటల్స్ కు బ్రేక్ ఇవ్వనున్న ఆస్ట్రేలియా స్టార్ పేసర్- సన్ రైజర్స్ నుంచి తప్పుకున్న మరో ఇంగ్లీష్ ప్లేయర్

క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 రసవత్తర పోరుకు సమయం దగ్గరపడింది. మార్చి 28 నుంచి పండగ మొదలుకావాల్సి ఉండగా, టోర్నీ ప్రారంభానికి ముందే పలు జట్లకు ఊహించని షాకులు తగులుతున్నాయి. తమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని భావించిన స్టార్ ప్లేయర్లు గాయాల బారిన పడి దూరం కావడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు తమ ప్రధాన అస్త్రాలను కోల్పోయి ఇప్పుడు ప్రత్యామ్నాయాల వేటలో పడ్డాయి. సీజన్ ఆరంభానికి ముందే ఐపీఎల్ గ్లామర్‌ను తగ్గించేలా వరుసగా ఆటగాళ్లు తప్పుకుంటున్న ఈ పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆ వివరాల్లోకి వెళితే

రాజస్థాన్ రాయల్స్‌కు కోలుకోలేని దెబ్బ

రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సీజన్ మొదలవ్వక ముందే భారీ ఎదురుదెబ్బ తగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ నుంచి ట్రేడ్ ద్వారా రాజస్థాన్ లోకి వచ్చిన ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ సామ్ కరన్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే అవకాశం ఉంది. మార్చి 5న భారత్ తో జరిగిన టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ తర్వాత ఆయన ఎటువంటి మ్యాచ్ ఆడలేదు. కరన్ లేకపోవడం వల్ల ఆల్ రౌండర్ల విభాగంలో రాజస్థాన్ బలహీనపడనుంది. ప్రస్తుతం ఆ జట్టులో రవీంద్ర జడేజా, డోనోవన్ ఫెరీరా వంటి ఆల్ రౌండర్లు ఉన్నప్పటికీ, కరన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం రాయల్స్ తీవ్రంగా అన్వేషిస్తోంది.

రాజస్థాన్ కెప్టెన్సీలో మార్పు

ఈసారి రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సరికొత్త సారథి రాబోతున్నాడు. యువ ఆటగాడు రియాన్ పరాగ్ 2026 సీజన్ లో రాజస్థాన్ జట్టును నడిపించనున్నాడు. మార్చి 30న గౌహతి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే పోరుతో రాజస్థాన్ తన ఆటను ప్రారంభించనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 4న అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో, ఏప్రిల్ 7, 10 తేదీల్లో గౌహతిలోనే ముంబై, బెంగళూరు జట్లతో తలపడనుంది. సామ్ కరన్ లేని లోటును రియాన్ పరాగ్ తన కెప్టెన్సీలో ఎలా అధిగమిస్తాడో చూడాలి.

ఢిల్లీ క్యాపిటల్స్ కు మిచెల్ స్టార్క్ షాక్

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కూడా తన ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ సేవలను ఆరంభ మ్యాచుల్లో కోల్పోనుంది. గతేడాది వేలంలో రూ. 11.75 కోట్లకు ఢిల్లీ సొంతం చేసుకున్న ఈ ఆసీస్ స్పీడ్ గన్, టోర్నీ మొదట్లో అందుబాటులో ఉండడు. రాబోయే అంతర్జాతీయ షెడ్యూల్ దృష్టిలో ఉంచుకుని స్టార్క్ కు విశ్రాంతి అవసరమని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. పవర్ ప్లే ఓవర్లలో వికెట్లు తీయడంలో దిట్ట అయిన స్టార్క్ లేకపోవడం వల్ల ఢిల్లీ బౌలింగ్ విభాగంలో పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆయన మళ్లీ ఎప్పుడు జట్టులో చేరుతాడనేది రాబోయే వారాల్లో రిటర్న్ టు ప్లే ప్రోటోకాల్స్ బట్టి తెలుస్తుంది.

సన్ రైజర్స్ హైదరాబాద్ కు వరుస కష్టాలు

సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు పరిస్థితి కూడా ఏమీ బాగోలేదు. ఆ జట్టు ఆల్ రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ పాదానికి గాయం కావడంతో ఐపీఎల్ 2026 నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. రూ. 3 కోట్లకు కొనుగోలు చేసిన ఎడ్వర్డ్స్, తన ఐపీఎల్ అరంగేట్రం కోసం ఇంకా వేచి చూడాల్సిందే. బిగ్ బాష్ లీగ్ లో 19 వికెట్లు తీసి మంచి ఫామ్ లో ఉన్న ఎడ్వర్డ్స్ దూరం కావడం ఎస్ఆర్‌హెచ్ కు పెద్ద లోటే. ఇప్పటికే కమిన్స్ గాయం వల్ల ఆందోళనలో ఉన్న హైదరాబాద్ కు ఇది అదనపు భారం.

ఇషాన్ కిషన్ చేతికి హైదరాబాద్ పగ్గాలు

సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెన్నునొప్పి కారణంగా సీజన్ ఆరంభ మ్యాచులకు దూరం కావడంతో, ఇషాన్ కిషన్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. కమిన్స్ కోలుకునే వరకు ఇషాన్ నాయకత్వంలోనే హైదరాబాద్ బరిలోకి దిగనుంది. మార్చి 28న బెంగళూరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీతో జరిగే తొలి మ్యాచ్ లోనే ఇషాన్ తన కెప్టెన్సీ సత్తాను నిరూపించుకోవాల్సి ఉంది. కొత్త కెప్టెన్, కీలక బౌలర్ల గైర్హాజరీలో సన్ రైజర్స్ ప్రయాణం ఎలా సాగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది. కేవలం స్టార్క్, కమిన్స్ మాత్రమే కాకుండా జోష్ హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్ వంటి ఇతర ఆస్ట్రేలియా పేసర్లు కూడా గాయాల కారణంగా ఆరంభ మ్యాచులకు దూరం కానున్నారు. హేజిల్‌వుడ్ ఆర్‌సీబీకి, కమిన్స్ ఎస్ఆర్‌హెచ్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రధాన పేసర్లందరూ ఒకేసారి గాయాల బారిన పడటం, విశ్రాంతి తీసుకోవడం వల్ల ఆయా జట్ల బౌలింగ్ విభాగాలు బలహీనమయ్యాయి. ఈ కీలక బౌలర్లు లేని సమయంలో దేశీయ బౌలర్లు ఎంతవరకు రాణిస్తారో చూడాలి.

# భారత్‌లో 2028 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్- ఏ స్టేట్‌లో జరగనున్నాయంటే



### 2028లో జరగనున్న ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యమివ్వనున్న భారత్ ధఖరారు చేసిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్

2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. పోలాండ్‌లోని టోరూన్ నగరంలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2028 సంవత్సరానికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులను భారత్‌కు అప్పగించామని వరల్డ్ అథ్లెటిక్స్ వైస్ ప్రెసిడెంట్ అదిల్లే సుమరివాలా ప్రకటించారు.

ఈ ఏడాది పోలాండ్ వేదికగా మెగా ఈవెంట్

ఈ ఏడాదికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోలాండ్ నగరంలో మార్చి 20-22 వరకు జరగనుంది. ఈ ఈవెంట్ ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ 2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇచ్చే బాధ్యతను భారత్‌కు అప్పగించింది. ఈ క్రమంలో ఈ మెగా ఈవెంట్ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ ఇండోర్ అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనుంది. కాగా, 2028 ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్ కోసం తమ బిడ్‌ను ఈ ఏడాది ప్రారంభంలోనే భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) వేసింది. దీంతో ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ నుంచి ఇద్దరు సభ్యుల బృందం ఈ ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో ఉన్న అత్యాధునిక ఇండోర్ సదుపాయాన్ని పరిశీలించింది. ఈ క్రమంలో తాజా నిర్ణయం వెలువడింది.

హర్షం వ్యక్తం చేసిన ఏఎఫ్ఐ అధ్యక్షుడు సగూ

కాగా, 2028లో జరగబోయే ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కడంపై ఏఎఫ్ఐ అధ్యక్షుడు బహదూర్ సింగ్ సగూ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుతోందనడానికి ఈ పరిణామం ఒక సూచిక అని పేర్కొన్నారు. "ప్రపంచ అథ్లెటిక్స్ 2028 ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌ను నిర్వహించే బాధ్యతను భారత్‌కు అప్పగించింది. ఇది భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుదలకు నిదర్శనం. ప్రముఖ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వరుసగా ఒలింపిక్, ప్రపంచ పతకాలు గెలిచినప్పటి నుంచి భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది." అని బహదూర్ సింగ్ సగూ వెల్లడించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి న్యూజిలాండ్ కూడా గతంలో ఆసక్తిని వ్యక్తం చేసింది. అయినప్పటికీ 2028లో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించే అవకాశం భారత్‌కు దక్కింది. భారత్ పోటీలో ఉన్నందున ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే నిర్ణయం తీసుకున్నప్పుడు తమను లోపలికి అనుమతించలేదన్నారు సాంకేతిక కమిటీ ఛైర్మన్, ఏఎఫ్ఐ మాజీ కార్యదర్శి రవీందర్ చౌదరి. ఆ తర్వాత ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని భారత్‌కు ఇచ్చినట్లు వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్స్ ప్రకటించిందని తెలిపారు.

3రోజులపాటు ఈవెంట్లు

ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్స్‌లో సాధారణంగా మూడు రోజుల పాటు 26 ఈవెంట్‌లు (పురుషులకు, మహిళలకు చెరో 13) జరుగుతాయి. పోలాండ్‌లో జరుగుతున్న ఈ ఎడిషన్‌లో 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలేను మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. ఆ 13 ఈవెంట్లలో 60 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500మీటర్లు, 3000 మీటర్లు, 60 మీటర్లు హర్డిల్స్, 4×400 మీటర్లు రిలే, హై జంప్, పోల్ వాల్ట్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, హెప్టాథ్లాన్ (మహిళలకు పెంటాథ్లాన్) ఉన్నాయి.

భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో 2024లో ప్రారంభమైంది. అక్కడి అత్యాధునిక ఇండోర్ ఫెసిలిటీలో 2028 ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ కూడా బిడ్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఏషియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం ఈ ఏడాది కళింగ స్టేడియం కాంప్లెక్స్‌ను పరిశీలించింది. కాగా, భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలోని ఇండోర్ ఫెసిలిటీలో మార్చి 24-25 వరకు తొలి జాతీయ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఇండోర్ అథ్లెటిక్స్ సెంటర్‌లో 200 మీటర్ల సింథటిక్ ట్రాక్, 80 మీటర్లు ప్లస్ 20 మీటర్ల రన్నింగ్ ట్రాక్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, షాట్ పుట్ కోసం ప్రత్యేక ట్రాక్‌లు ఉన్నాయి. పూర్తికాల కోచింగ్ తీసుకుంటున్న వారి కోసం ఈ ఫెసిలిటీలో 60 ట్విన్ షేరింగ్ రూమ్స్ ఉన్నాయి. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలన్న దేశ ఆకాంక్షకు అనుగుణంగా, భారత్ అనేక ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ ఈవెంట్‌ల కోసం బిడ్లు దాఖలు చేసింది. అహ్మదాబాద్‌లో జరగనున్న 2028 ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌తో పాటు 2031 ప్రపంచ (సీనియర్) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ కోసం కూడా భారత్ బిడ్ దాఖలు చేయనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ 2030లో జరగబోయే కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.

## మెదక్ జిల్లా నాగ్సన్‌పల్లి గ్రామంలో

# ఘనంగా బండ్ల ఊరేగింపు...





**మెదక్//మార్చి 20 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సన్‌పల్లి గ్రామంలో గ్రామ దేవతల పండుగ సందర్భంగా శుక్రవారం సాయంకాలం బండ్ల ఊరేగింపును గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ, పోచమ్మ గుడుల చుట్టూ సంప్రదాయబద్ధంగా బండ్లు తిరగడం విశేషంగా నిలిచింది. పండుగ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం వేళ రామదేవతల అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు. గ్రామంలో ఎలాంటి రోగాలు, అనారోగ్యాలు రాకుండా అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. గ్రామ ఆడపడుచులు, యువకులు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావం బండ్ల ఊరేగింపులో ప్రతిఫలించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండం సుశీల దుర్గేష్‌తో పాటు వార్డు సభ్యులు తలారి నగేష్, సురేష్, రామ్‌చందర్, యాదగిరి, పొలబోయిన అజయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ యువకులు...



**మెదక్//మార్చి 20 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర మధ్యాహ్న భోజనాన్ని బీఆర్ఎస్ యువకులు, స్థానిక నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశంపై వారు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా 9వ వార్డు మెంబర్ రామప్ప రాజ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు దండోళ్ల సామెల్, అక్కమ్మ వెంకట్, పైతర భూపాల్ తదితరులు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, పిల్లలకు అందుతున్న ఆహార పరిమాణం వంటి అంశాలను వారు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం శుభ్రంగా, పోషకవంతంగా ఉండాలని, ప్రభుత్వం మరియు సంబంధిత నిర్వాహకులు ఈ విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వారు సూచించారు. పిల్లల ఆరోగ్యానికి ఉపయోగపడే విధంగా అక్షయపాత్ర భోజనం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా

# కలిసిన డాక్టర్ దిలీప్ రెడ్డి...



**నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 20 (ఆకాంక్ష) :** ఇటీవల జిల్లా డాక్టర్స్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ జిల్లా చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ సందడి దిలీప్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పాటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి, పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. ప్రజాసేవ చేసే అవకాశం కొద్దిమందికే లభిస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇటీవల గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ చేతుల మీదుగా ఆయనకు డిసిసి డాక్టర్స్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ జిల్లా చైర్మన్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ డాక్టర్ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డికి డాక్టర్ దిలీప్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జయకృష్ణ ఆస్పత్రి సిబ్బంది తౌరియా నాయక్, ఆఫ్రిన్, సంగీత, గీత, టిల్లు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## మల్లేశ్వరంలో అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం...



**నాగర్‌కర్నూల్//మార్చి 20 (ఆకాంక్ష) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర గ్రామంలో గురువారం రాత్రి శ్రీకృష్ణ నాట్య కళామండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, సీతాకళ్యాణం నుంచి రావణ విజయ ఘట్టం వరకు సాగిన పౌరాణిక నాటక ప్రదర్శనలు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతరించిపోతున్న పౌరాణిక పద్యనాటకాలు, కూచిపూడి, భరతనాట్యం, హరికథ, బుర్రకథ, వీధి నాటకాలు వంటి భారతీయ సాంప్రదాయ కళారూపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం రంగస్థల కళాకారుల గొప్ప కృషి అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధునిక కాలంలో కృత్రిమ మేధస్సు, గ్రాఫిక్స్ ఆధారిత వినోదం పెరుగుతున్నప్పటికీ, ఒకే వేదికపై పాట, పద్యం,అభినయం, సాహిత్యంతో ప్రజలను చైతన్యపరుస్తున్న రంగస్థల కళాకారులే నిజమైన హీరోలని తెలిపారు. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తే మహాభారతం, రామాయణం, భాగవతం వంటి ఇతిహాసాల సారాంశాలను నాటకాల రూపంలో మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసి, సత్యంధర్మం వైపు నడిపించే ప్రయత్నం కొనసాగిస్తామని శ్రీకృష్ణ నాట్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కారంగి ఈశ్వరయ్య అన్నారు. ఈ నాటకంలో హరిశ్చంద్రుడులుగా వేణుమాధవ్ గౌడ్, కారంగి ఈశ్వరయ్య, జీకే వెంకటేష్, ధర్మారెడ్డి నటించగా, విశ్వామిత్రుడిగా యుగంధర్, నక్షత్రకుడిగా కేశవ గౌడ్, రామకృష్ణ, బాలచంద్రి,సత్యకీర్తిగా కారంగి గోపాల్, రావణుడిగా నాగేశ్వరరావు, చంద్రమతిగా శ్రీమతి సరోజ, కేశవ జనార్ధనుడిగా వెంకటయ్య గౌడ్, బాలరాజ్‌లు అభినయించారు. సంగీతాన్ని కాల శ్రీనివాస్ అందించారు. అనంతరం కళాకారులను శ్రీకృష్ణ నాట్య కళామండలి సభ్యులు సన్మానించారు.



## కృష్ణారెడ్డికి డీసీసీ అధికార ప్రతినిధి బాధ్యతలు...



**నాగర్ కర్నూల్ టౌన్/మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా కృష్ణారెడ్డిని నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కాంగ్రెస్‌లో కీలక బాధ్యత దక్కడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు డా. చిక్కుడు వంశీ కృష్ణ, ఎంపీ మల్లురవికి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

# స్పాట్ బకాయిలను వెంటనే చెల్లించాలి...



**నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 20 (ఆకాంక్ష) :** గత సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి స్పాట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని జిల్లా పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పీఆర్‌టీయూ తెలంగాణ అసోసియేట్ అధ్యక్షుడు రాముడు నాయక్, గౌరవాధ్యక్షుడు ఆమరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలు పుష్పవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా పదవ తరగతి స్పాట్ రేట్లను ప్రభుత్వం పెంచలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఇంటర్మీడియట్ స్పాట్ రేట్లు గత రెండు మూడు సంవత్సరాలుగా పెంచుతున్నప్పటికీ, పదవ తరగతి స్పాట్ రేట్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. పదవ తరగతి స్పాట్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉండటం అన్యాయమని పేర్కొన్నారు. స్పాట్ కేంద్రాల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు కనీస వసతులు కూడా సమకూర్చడం లేదని నాయకులు మండిపడ్డారు. వెంటనే స్పాట్ రేట్లను పెంచడంతో పాటు గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే స్పాట్ కేంద్రాలకు స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించబడే ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు దినసరి కూలీలకంటే తక్కువ రేట్లు నిర్ణయించడం సరికాదని అభిప్రాయ పడ్డారు. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించరాదని, జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఉపాధ్యాయులనే ఈ విధులకు ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, స్పాట్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటన జారీ చేసిన వారిలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శివరామకృష్ణ గౌడ్, జిల్లా ట్రెజరర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కమిటీని ఘనంగా

# సన్మానించిన టీడీపీ సీనియర్ నాయకులు...



**ఉప్పల్//మార్చి 20 (ఆకాంక్ష) :** ఉప్పల్ ప్రాంతంలో మీడియా ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఉప్పల్ మీడియా క్లబ్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీని టిడిపి సీనియర్ నాయకుడు, చిలుకా నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పబ్బతి శేఖర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పబ్బతి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సీనియర్ జర్నలిస్టు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం అభినందనీయ పరిణామమని పేర్కొన్నారు. సమాజానికి నిజమైన, సమగ్ర సమాచారం అందించడంలో మీడియా ఐక్యత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. మీడియా ప్రతినిధులు వృత్తి నైతిక విలువలను కాపాడుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, మీడియా వర్గాల ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు సమాజానికి అద్దంలాంటి వారని, వారి సమిష్టి కృషి ప్రజాస్వామ్య బలపాటుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తెలుగు యువత యువ నాయకుడు బజారు హేమంత్ గౌడ్, డా. రాంబాబు, శివ, విష్ణు గౌడ్, మహేష్, మీడియా ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగి, నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బజరంగ్ దళ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి...




**నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 20 (ఆకాంక్ష) :** బజరంగ్ దళ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను నిర్వాహకులు వివరించారు. వేపపూలు, బెల్లం, చింతపండు, మామిడి ముక్కలు, ఉప్పు, మిరపకారం కలిపి తయారు చేసే ఉగాది పచ్చడి జీవితం లోని వివిధ అనుభవాలకు ప్రతీక అని తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పతాంజలి యోగ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వస్పరి శివుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, జెన్ను, సొప్పరి బాలస్వామి, వార్డు సభ్యులు శివ నాగులు, కొంకలి మధు, వెంకటేష్, అర్జున్, కాశిరెడ్డి చంద్రారెడ్డి, రామకృష్ణతో పాటు బజరంగ్ దళ్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏడుపాయలకు బస్సు సౌకర్యం కల్పించాలని భక్తుల విజ్ఞప్తి...



**మెదక్//మార్చి 20 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ ఏడుపాయల దేవస్థానానికి భక్తులకు తగిన బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది అమ్మవారిని దర్శించుకోవడానికి ఏడుపాయలకు తరలివస్తున్నప్పటికీ, రవాణా సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడుపాయల దేవస్థానం రాష్ట్ర వ్యాప్తంగా విశేష ఖ్యాతిని గడించింది. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ముఖ్యంగా పండుగలు, జాతరలు, ప్రత్యేక పూజల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతోంది. దేవస్థానానికి వివిధ టెండర్ల ద్వారా సుమారుగా కోటి రూపాయల మేర ఆదాయం వస్తోందని సమాచారం. ఇటీవల జరిగిన మహాశివరాత్రి సందర్భంగా మాత్రమే దాదాపు 80 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో వీరేశం వెల్లడించినట్లు భక్తులు తెలిపారు. అయితే, ఈ స్థాయిలో ఆదాయం వస్తున్నా, భక్తులకు అవసరమైన కనీస రవాణా సౌకర్యాలు లేక పోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ప్రత్యేకించి మెదక్ డిపో నుండి రెండు బస్సులు, సంగారెడ్డి నుండి రెండు బస్సులు, హైదరాబాద్ నుంచి రెండు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడిపితే భక్తులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం ఏడుపాయలకు చేరుకునేందుకు అనేక మంది భక్తులు వ్యక్తిగత వాహనాలు లేదా ప్రైవేట్ రవాణాపైనే ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల ఆర్థికభారం పడటంతో పాటు వృద్ధులు, మహిళలు, చిన్నారులు మరింత ఇబ్బందులు పడుతున్నారని భక్తులు తెలిపారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించి, శాశ్వత ప్రాతిపదికన బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. పుణ్యక్షేత్ర ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, దేవాదాయ శాఖ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో స్పందించి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి చర్యలతో భక్తులకు ఇబ్బందులు తొలగడమే కాకుండా దేవస్థానానికి మరింత ఆదరణ పెరిగే అవకాశముందని వారు అంటున్నారు.

## కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మిక తనిఖీ...



**నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్ శుక్రవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టితో కలిసి పాఠశాలను పరిశీలించిన డీఈఓ, విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదులు, డైనింగ్ హాల్, కిచెన్ ప్రాంతాలను తనిఖీ చేసి విద్యాబోధన, వసతులపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థినులకు అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. ఇటీవల జరిగిన సంఘటనలపై విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడిన ఆయన, పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినులకు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

## బసంత్‌నగర్ విద్యుత్ ఏఈ తీరుపై ఉద్యోగుల గళం...

### ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన...



**పెద్దపల్లిటౌన్//మార్చి 20 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ విద్యుత్ శాఖ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ వ్యవహార శైలిపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఆపరేటర్లను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాఘవపూర్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సంబంధిత అధికారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి మాట్లాడుతూ, సబ్‌స్టేషన్లలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ల పట్ల ఏఈ మానాల ప్రసాద్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విధి నియమాలకు విరుద్ధంగా అర్ధరాత్రి వేళల్లో సబ్‌స్టేషన్లకు చేరుకుని సిబ్బందిపై ఒత్తిడి తీసుకురావడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఆపరేటర్ల విధి నిర్వహణను గౌరవించాల్సిన అధికారి వారితో అవమానకరంగా ప్రవర్తించడం, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. ఇలాంటి కక్షపూరిత వైఖరిని కొనసాగించడం శాఖలోని సిబ్బంది మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ మానాల ప్రసాద్ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి, బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఈ గంగాధర్‌కు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. సమస్యను పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో టీజీ ఎన్పీడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి. ఆంజనేయులు, రీజనల్ అధ్యక్షుడు వాగు నాయక్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సయ్య, డివిజన్ అధ్యక్షుడు కొండయ్య, ప్రధాన కార్యదర్శి కె. నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, మంథని డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌తో పాటు సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి


## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పరామర్శ...



**నాగర్‌కర్నూల్//మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్, సివిల్ కాంట్రాక్టర్ బండారు శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వనపట్ల గ్రామంలోని శ్రీనివాస్ రెడ్డి నివాసానికి చేరుకున్న మర్రి జనార్దన్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ, గ్రామాభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. శ్రీనివాస్ రెడ్డి మరణం గ్రామానికి, స్థానిక సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగం శశిధర్ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు హాజరై తమ సంతాపాన్ని తెలియజేశారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకుని శ్రీనివాస్ రెడ్డికి నివాళులు అర్పించారు.

# మున్సిపల్ అభ్యర్థులకు కీలక సూచనలు...

### ఎన్నికల ఖర్చుల వివరాలు 45 రోజుల్లోపు సమర్పించాలి...



**నాగర్ కర్నూల్//మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన, ఓడిపోయిన అన్ని అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల ఆదాయ-వ్యయ వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి సూచించారు. కేంద్ర ఎన్నికల చట్టం, 1951 ప్రకారం ఈ నిబంధనలు అమలులో ఉన్నాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల లెక్కింపు తేదీ నుంచి 45 రోజుల్లోపు అభ్యర్థులు తమ ఖర్చుల పూర్తి వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఖర్చుల లెక్కల సమర్పణకు ఈ నెల 28, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా చేసిన ప్రతి ఖర్చుకు సంబంధించిన ఆదాయ-వ్యయ లెక్కలను నిర్దిష్ట నమూనాలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు అవసరమైన ఫార్మాట్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. గడువు లోపు ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, అలాంటి వారు భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని కమిషనర్ హెచ్చరించారు. అందువల్ల మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి నిబంధనలను పాటిస్తూ, నిర్దేశిత గడువులోపు తమ ఎన్నికల ఖర్చుల పూర్తి వివరాలను సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి కోరారు.

# ఈ నెల 26న ఉచిత కంటి చికిత్స శిబిరం...

## ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్లు...

నాగర్ కర్నూల్//**మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 26న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ అధికారులు తెలిపారు. ఈ శిబిరం గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నంబర్ 102లో నిర్వహించబడనున్నట్లు నాగర్ కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ వెల్లడించారు.శిబిరానికి హాజరయ్యే రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమైన రోగులను గుర్తించి, ముఖ్యంగా క్యాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్న వారికి మహబూబ్ నగర్ జిల్లా ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.శస్త్రచికిత్సకు ఎంపికైన రోగులను ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఏనుగొండకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినట్లు అధికారులు తెలిపారు. శిబిరానికి వచ్చే రోగులు ముందుగానే బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని సంబంధిత రిపోర్టులను వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లేదా ఏదైనా ఒక గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీతో పాటు మొబైల్ నంబర్‌ను కూడా తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రాంతీయ రోగులు వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కోరింది. శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9440876556, 7386940480 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# డీసీసీ సభ్యుడిగా సూత్రపు పరమేశ్ నియామకం...



పెద్దపల్లి//**మార్చి 20 (ఆకాంక్ష) :** టీపీసీసీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూత్రపు పరమేశ్ నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేసిన జిల్లా కార్యవర్గ జాబితాలో ఆయనకు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా స్థానం లభించింది.పార్టీలో చురుకుగా పనిచేస్తూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్న పరమేశ్‌కు ఈ బాధ్యతలు అప్పగించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో పార్టీకి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సూత్రపు పరమేశ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ కమిటీలో స్థానం కల్పించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ల సహకారాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.విప్ విజయ రమణారావు ఆదేశాల మేరకు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రజల సమస్యలను పార్టీ వేదికగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని పరమేశ్ స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పరమేశ్ నియామకంతో బ్రాహ్మణపల్లి గ్రామంతో పాటు పెద్దపల్లి మండలంలో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నియామకం జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూర్చే దిశగా ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యత్వ నమోదు వేగవంతం...

## విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి విరాళాలివ్వాలని పిలుపు...




పెద్దపల్లి//**మార్చి 20 (ఆకాంక్ష) :** యాదవ చారిటబుల్ ట్రస్ట్‌లో చేరదలచిన వారు ఈ నెల 31వ తేదీలోపు సభ్యత్వ నమోదు చేసుకోవాలని ట్రస్ట్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అఖిల భారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దపల్లి ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేని రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి జిల్లాలోని 13 మండలాలకు కొత్త మండల కమిటీలను ఎంపిక చేస్తామని చెప్పారు. సంఘ బలోపేతానికి కృషి చేసే నాయకత్వాన్ని గుర్తించి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. మహిళా, యువత, యూపీ విభాగాలకు కూడా ప్రత్యేక కమిటీలను నియమించనున్నట్లు వెల్లడించారు.యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న యాదవ విద్యార్థి వసతి గృహం కోసం జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ రూ.40 లక్షల విరాళం ప్రకటించడం పట్ల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వసతి గృహ భవన నిర్మాణానికి జిల్లాలోని యాదవ వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఉద్యోగులు, వివిధ వర్గాల యాదవ కులబాంధవులు ముందుకు వచ్చి విరాళాల రూపంలో సహకరించాలని కోరారు.యాదవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నామని అన్నారు. ట్రస్టీ సభ్యత్వం పొందదలచిన వారు ఈ నెల 31లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ట్రస్టీ సభ్యత్వ రుసుము రూ.1,10,116 కాగా, సాధారణ ట్రస్ట్ సభ్యత్వ రుసుము రూ.10,116గా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో చిలారపు పర్వతాలు యాదవ్, పెగడ రమేష్ యాదవ్, గొడుగు రాజ్‌కుమార్ యాదవ్, వేల్పుల నాగరాజ్ యాదవ్, గుంపుల ఓదెలు యాదవ్, బత్తిని లక్ష్మణ యాదవ్, మారం వెంకటరమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ-11 గనిలో ఒక్కరోజే రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి...



గోదావరిఖని,//**మార్చి 20 (ఆకాంక్ష) :** సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ భూగర్భ గని ఒక్కరోజులోనే రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించి విశేష గుర్తింపు పొందింది. రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 2916 టన్నులు కాగా, దానిని అధిగమిస్తూ 4025 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 138 శాతం లక్ష్య సాధన నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ పరిధిలోని అన్ని భూగర్భ గనుల్లో ఇదే అత్యధిక రోజువారీ ఉత్పత్తిగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ జీడీకే-11 ఇంక్లైన్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా గని విజయానికి కృషి చేసిన అధికారులు,సూపర్వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు, సహకరించిన యూనియన్ నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, భూగర్భ గనిలో యంత్రాలు సుమారు 20 గంటలపాటు నిరంతరాయంగా పనిచేయడం ఈ రికార్డు విజయానికి ప్రధాన కారణమన్నారు. ముఖ్యంగా కంటిన్యూయస్ మైనర్-2వ విభాగం 200 శాతం లక్ష్యాన్ని సాధించడం విశేషమని పేర్కొన్నారు. గనిలో పని చేసిన ఆపరేటర్లు, టెక్నీషియన్లు, సూపర్వైజర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు, సిబ్బంది అందరి సమిష్టి కృషి వల్లే ఈ విజయాన్ని అందుకున్నామని ఆయన కొనియాడారు.అలాగే మరమ్మతులు పూర్తి చేసిన జీడీకే-11 గని మేనేజర్ కార్యాలయాన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రూప్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, పిట్ ఇంజనీర్ రాకేష్, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇన్‌చార్జి క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్లు శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ తదితర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.ం

# రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప అభివృద్ధి దిశలో అడుగుల్లేవు...


## సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు విమర్శలు...



నాగర్‌కర్నూల్//**మార్చి 20 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడో సారి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడీ, అప్పుల భారం తప్ప ప్రజల అభివృద్ధికి దారితీసే స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రజలకు అనుకూలంగా ఉందని ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవానికి యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, వెనుకబడిన జిల్లాలకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు.యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన యువత డిక్లరేషన్ గానీ, నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని చెప్పిన హామీ గానీ బడ్జెట్‌లో ఎక్కడా ప్రతిఫలించలేదన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదలపై కూడా ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది మంది యువకులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో బడ్జెట్‌లో వారికోసం ఆశాజనకమైన అంశాలు లేకపోవడం బాధాకరమని చెప్పారు.విద్యారంగంపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబించిందని పర్వతాలు అన్నారు. విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని పలువురు నిపుణులు, విద్యావేత్తలు సూచించినప్పటికీ, ప్రభుత్వం నామమాత్రపు కేటాయింపులతో సరిపెట్టుకుందని విమర్శించారు. ఆకునూరు మురళి విద్యా కమిషన్ విద్యారంగానికి కనీసం రూ.5,000 కోట్లు కేటాయించాలని సూచించినప్పటికీ, ఆ దిశగా ప్రభుత్వం ముందడుగు వేయలేదన్నారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అనేక సమస్యలు పేరుకుపోయినా వాటి పరిష్కారానికి సరిపడ నిధులు కేటాయించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు ఈసారి బడ్జెట్‌లో తమ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుందని ఆశించారని, ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు వస్తాయని భావించారని చెప్పారు. కానీ జిల్లాకు ఆశించిన స్థాయిలో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొంటే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని భావించిన ప్రజలకు ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చిందన్నారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు తగిన స్థాయిలో నిధుల కేటాయింపు పెంచకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కొత్తగా సాగునీటి ప్రాజెక్టులకు అధిక కేటాయింపులు చేయకపోవడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఆచరణలోకి రాకుండా ఉత్తి మాటలుగానే మిగిలి పోతున్నాయని పర్వతాలు విమర్శించారు. రైతు భరోసా, మహిళలకు ఆర్థిక భృతి వంటి అనేక హామీలు అమలు దశకు చేరలేదని, కనీసం ఈ బడ్జెట్‌లోనైనా వాటి అమలుకు తగిన నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశించారని చెప్పారు. అయితే ఆ ఆశలు కూడా నెరవేరలేదని, హామీలన్నీ నీటిమట్టలుగానే మిగిలి పోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌ను తిరిగి పునఃపరిశీలించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటికీ తగిన నిధులు కేటాయించి అమలు దిశగా కట్టుబడి పని చేయాలని పర్వతాలు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం వెనుకబడిన ప్రాంతాలు, ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేసి, వాస్తవ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

# పిచ్చుకల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి...

## ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా జీఎం లలిత్ కుమార్ పిలుపు...




గోదావరిఖని//**మార్చి 20 (ఆకాంక్ష) :** ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలో అర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ పిచ్చుకల సంరక్షణపై ప్రజలకు ప్రత్యేక పిలుపునిచ్చారు. ఆధునిక జీవనశైలిలో భాగంగా మొబైల్ టవర్లు, కాలుష్యం, పచ్చదనం తగ్గిపోవడం వంటి కారణాలతో పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండటం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు.పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పిచ్చుకల పాత్ర ఎంతో ముఖ్యమని, జీవ వైవిధ్య పరిరక్షణలో అవి కీలక భాగమని అన్నారు. పిచ్చుకలు అంతరించి పోకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కావాలని స్పష్టం చేశారు. ఇళ్ల వద్ద నీటి పాత్రలు, గింజలు ఉంచడం, చెట్లు నాటడం, పిచ్చుకలు గూళ్లు కట్టుకునేలా అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా వాటి సంఖ్యను పెంచవచ్చని సూచించారు.పట్టణీకరణ వేగంగా పెరగడంతో పిచ్చుకలు గూళ్లు కట్టుకునే ప్రదేశాలు తగ్గిపోవడం కూడా వాటి సంఖ్య తగ్గుదలకు ప్రధాన కారణమని ఆయన అన్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు, పరిరక్షణ చర్యల ద్వారా పిచ్చుకలను కాపాడవచ్చని, అందుకోసం ప్రతి ఇంటి నుంచే అవగాహన ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్, గ్రీన్ వారియర్ జె.వి.ఎస్. చంద్రశేఖర్, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగితో కలిసి అటవీశాఖ రూపొందించిన పిచ్చుకల సంరక్షణ అవగాహన పోస్టర్‌ను ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని పలువురు ప్రస్తావించారు. పిచ్చుకలను కాపాడటం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడినట్లేనని పేర్కొన్నారు. పిచ్చుకల పాత్ర ఎంతో ముఖ్యమని, జీవ వైవిధ్య పరిరక్షణలో అవి కీలక భాగమని అన్నారు. పిచ్చుకలు అంతరించి పోకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కావాలని స్పష్టం చేశారు. ఇళ్ల వద్ద నీటి పాత్రలు, గింజలు ఉంచడం, చెట్లు నాటడం, పిచ్చుకలు గూళ్లు కట్టుకునేలా అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా వాటి సంఖ్యను పెంచవచ్చని సూచించారు.పట్టణీకరణ వేగంగా పెరగడంతో పిచ్చుకలు గూళ్లు కట్టుకునే ప్రదేశాలు తగ్గిపోవడం కూడా వాటి సంఖ్య తగ్గుదలకు ప్రధాన కారణమని ఆయన అన్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు, పరిరక్షణ చర్యల ద్వారా పిచ్చుకలను కాపాడవచ్చని, అందుకోసం ప్రతి ఇంటి నుంచే అవగాహన ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్, గ్రీన్ వారియర్ జె.వి.ఎస్. చంద్రశేఖర్, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగితో కలిసి అటవీశాఖ రూపొందించిన పిచ్చుకల సంరక్షణ అవగాహన పోస్టర్‌ను ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు.కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని పలువురు ప్రస్తావించారు. పిచ్చుకలను కాపాడటం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడినట్లేనని పేర్కొన్నారు.

### విద్యారంగానికి న్యాయం చేయని

# బడ్జెట్‌పై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం...



గోదావరిఖనిటౌన్ //**మార్చి 20 (ఆకాంక్ష) :** రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖనిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని మండిపడ్డారు.అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు మాత్రమే కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి విద్యపై ఉన్న ఆసక్తి ఎంతమాత్రమో స్పష్టమైందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని పూర్తిగా విస్మరించి 8.22 శాతానికే పరిమితం కావడం దారుణమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు వేల కోట్ల రూపాయల మేర పేరుకుపోయి ఉండగా, ప్రభుత్వం మాత్రం అందుకు సరిపోని స్థాయిలో మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటోందని ఆరోపించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.రాష్ట్రంలోని ఉన్నత విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు కేటాయించకపోవడం బాధాకరమని, మరోవైపు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పేరుతో భారీ మొత్తాలను కేటాయిస్తూ ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరమని చెప్పారు.డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ఇంటర్మీడియట్ మరియు ఇతర విద్యాసంస్థలకు స్వంత భవనాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సరైన నిధులు లేకపోవడం వల్ల విద్యా వ్యవస్థ మరింత దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ విద్యా అభివృద్ధికి దోహదపడేదిగా కాకుండా విద్యా దారిద్ర్యానికి దారి తీసేదిగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, ఇప్పటికైనా విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఉద్యోగుల విశ్రాంతి కోసం

# సమావేశ హాలు, ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం...

## జిడికే 1&3 ఇంక్లైన్‌లో జీఎం లలిత్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం...



గోదావరిఖని//**మార్చి 20 (ఆకాంక్ష) :** జిడికే 1&3 ఇంక్లైన్‌లో ఉద్యోగుల విశ్రాంతి, సమావేశాల సౌకర్యార్థం మరమ్మతులు చేసిన సమావేశ హాలును, అలాగే శుద్ధమైన తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఆర్జీ-1 జీఎం శ్రీ లలిత్ కుమార్ ప్రారంభించారు. ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం రిబ్బన్ కత్తిరించి ఈ సదుపాయాలను ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, జిడికే 1&3 ఇంక్లైన్‌లో పనిచేసే ఉద్యోగులు సేదతీరేందుకు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ సమావేశ హాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. అలాగే ఆర్ఓ వాటర్ ప్లాంట్ ద్వారా ఉద్యోగులకు శుద్ధమైన తాగునీరు అందుతుందని చెప్పారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా ప్రమాణాలను సాధించేందుకు ప్రతి ఉద్యోగి కట్టుబాటుతో కృషి చేయాలని జీఎం పిలుపునిచ్చారు. లక్ష్య సాధనలో సమష్టిగా ముందుకు సాగాలని, ఉత్పత్తితో పాటు భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్ది ఎల్లయ్య, ఏజెంట్ ఎల్. రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, గని మేనేజర్ సుదీర్ జక్కుల్‌వార్, గ్రూప్ ఇంజనీర్ ఓదెలు, రక్షణ అధికారి ఎన్. శ్రీను, పిట్ సెక్రటరీ ఎం. శ్రీనివాస్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ఆర్జీ-1లో ఆర్థిక సంవత్సరం ముగింపు పై సమీక్ష సమావేశం...



గోదావరిఖని//**మార్చి 20 (ఆకాంక్ష) :** ఆర్జీ-1 ఏరియాలో 202526 ఆర్థిక సంవత్సరం ముగింపుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అకౌంట్స్, బుక్స్ క్లోజింగ్, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో సవివరంగా చర్చించారు.ఈ సందర్భంగా గనుల వారీగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అంశాలను సమగ్రంగా సమీక్షించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులు, ఖాతాల సర్దుబాటు, లెక్కల ముగింపు ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.సమావేశంలో ఏఓ ఏ. క్రాంతికుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను విపులంగా ప్రదర్శించారు. వివిధ గనుల్లో నెలకొన్న ఆర్థిక పరమైన పెండింగ్ అంశాలు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కారానికి అవసరమైన చర్యలను ఆయన వివరించారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు సూచనలు జారీ చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జీఎం డి. లలిత్ కుమార్,ఎస్ఓటు జీఎం కె. చంద్రశేఖర్, జీడీకే-11 సీహెచ్ ఏజెంట్ శ్రీనివాస్, డీజీఎం ఫైనాన్స్ ఎస్. ధనలక్ష్మీ బాయి, ఓసీ-5 పీవో రమేష్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్ రావు, అధికారులు మోహన్ రావు, రవీందర్ రెడ్డి, కుమారస్వామి, లక్ష్మిరాజం, అన్ని గనుల మేనేజర్లు, సంక్షేమ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి, సంస్థ పనితీరులో పారదర్శకత, సమర్థత పెంపునకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

### గోదావరిఖని ఈద్గాహ్‌ల వద్ద

# రంజాన్ బందోబస్తు ఏర్పాట్ల సమీక్ష...

## సిపి అంబర్ కిషోర్ ఆదేశాలతో పోలీస్ అధికారుల పరిశీలన...



గోదావరిఖనిటౌన్//**మార్చి 20 (ఆకాంక్ష) :** రంజాన్ పర్వదినం సందర్భంగా రేపు జరగనున్న ప్రత్యేక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని గోదావరిఖని పరిధిలోని ఈద్గాహ్ ప్రాంగణాల్లో భద్రతా ఏర్పాట్లపై రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఏసీపీలు,సీఐలు,ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి ఈద్గాహ్‌లను సందర్శించి బందోబస్తు చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రార్థనల కోసం ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ప్రార్థనా ప్రాంగణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అదే విధంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సదుపాయాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు సౌకర్యవంతంగా ప్రార్థనల్లో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో పోలీస్ అధికారులు సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి ప్రాంగణం చుట్టుపక్కల పరిస్థితులను పరిశీలించి అవసరమైన జాగ్రత్త చర్యలపై చర్చించారు. పర్వదినం ప్రశాంత వాతావరణంలో,సామరస్యపూర్వకంగా జరిగేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుతంగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీసుల సూచనలను అనుసరించాలని కోరారు.

### ఎమ్మెల్యే విజయ రమణరావుకు

# విప్ నియామక సంబరాలు...



ఓదెల//**మార్చి 20 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేటు వద్ద పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించాయి. ఇదే సమయంలో ఎమ్మెల్యే విజయ రమణరావు పావని దంపతుల పెళ్లిరోజు కావడంతో శుభాకాంక్షల మధ్య కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యేకు విప్ పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, పెద్దపల్లి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావును రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే విజయ రమణరావుపావని దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు కొనసాగించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైరీ రవి గౌడ్, సర్పంచ్ పల్లె కనకయ్య, మడక సర్పంచ్ ఆవాల ప్రసాద్, సామడిలీ శంకర్, కందుల సదాశివ్ పటేల్, గంట రమేష్, రాపోలు హనుమంతరావు, తోట సంతోష్ రావు, అమ్ముల బిక్షపతి, పాకాల కరుణాకర్ రెడ్డి, జంగం కొమురయ్య, గోపు రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో

# సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం...



నాగర్ కర్నూల్//**మార్చి 20 (ఆకాంక్ష) :** తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు. కళాశాల ఏకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల పెంపును ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీడ్ బాల్స్ అనేవి మట్టి, ఎరువు, విత్తనాలను కలిపి తయారు చేసే గోళాకార బంతులని వివరించారు. వీటిని ఎండిపోయిన భూములు, అడవి అంచులు, ఖాళీ ప్రదేశాల్లో విసరడం ద్వారా సహజసిద్ధంగా మొక్కలు పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వర్షాకాలంలో సీడ్ బాల్స్ తడిసి మట్టిలో కలిసిపోవడంతో విత్తనాలు సులభంగా మొలకెత్తుతాయని మదన్ మోహన్ చెప్పారు. చేరుకోవడం కష్టమైన కొండ ప్రాంతాలు, రహదారి పక్కలు, వృక్షావరణం తగ్గిపోయిన ప్రదేశాల్లో సీడ్ బాల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మొక్కలను పెంచేందుకు సీడ్ బాల్స్ సమర్థవంతమైన పద్ధతి అని, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పర్యావరణంపై అవగాహన పెంపొందుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి సంరక్షణ పట్ల బాధ్యతా భావం పెంపొందించేందుకు కళాశాల ప్రత్యేక కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వృక్షశాస్త్ర విభాగం సిబ్బంది, ఏకో క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొని సీడ్ బాల్స్ తయారీ విధానాన్ని ప్రాయోగికంగా అభ్యసించారు. పర్యావరణ హిత కార్యక్రమాలు సమాజానికి అవసరమని, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపులో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఇంద్రకల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఘన ముగింపు...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 20 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం శుక్రవారం ఘనంగా ముగిసింది. వారం రోజుల పాటు గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేట్ డీన్ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. శిబిరం సందర్భంగా పారిశుధ్యం, ఆరోగ్యం, ఆధునిక సాగు పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి, పంటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్, మాజీ సర్పంచ్ వెంకటయ్య మాట్లాడి కళాశాల సిబ్బందిని సన్మానించారు. శిబిరంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సర్పంచ్ బంగారమ్మ, రైతులు, గ్రామస్తులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




### శ్రమజీవి" కవితతో మెప్పించిన

# గవర్నర్ అవార్డు గ్రహీత రవీంద్ర చారి...



ఓదెల//**మార్చి 20 (ఆకాంక్ష) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో సాయంత్రం నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం సాహిత్యాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయ సాహితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దాస్యం లక్ష్మయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దాస్యం సేనాధిపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో ఓదెల మండల కేంద్రానికి చెందిన గవర్నర్ అవార్డు గ్రహీత బ్రాహ్మండ్లపల్లి రవీంద్ర చారి పాల్గొని "శ్రమజీవి" అనే కవితను చదివి వినిపించారు. శ్రమజీవుల జీవన సత్యాలను ప్రతిబింబించేలా ఆయన వినిపించిన కవిత సభలోని ప్రేక్షకులను ఆలోచింపజేసి, విశేష స్పందనను పొందింది. కవితా వచనంలో ఉన్న భావగాఢత, సామాజిక స్పృహ సభికులను ఆకట్టుకోవడంతో రవీంద్ర చారికి ప్రత్యేక అభినందనలు




లభించాయి. కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు రవీంద్ర చారిని శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆయన సాహిత్య సేవలను కొనియాడుతూ మరిన్ని వేదికలపై తన కవిత్వాన్ని పరిచయం చేసి సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఉగాది కవి సమ్మేళనంలో జిల్లాలోని 30 మందికి పైగా కవులు, కవయిత్రులు పాల్గొని తమ తమ కవితలతో ప్రేక్షకులను అలరించారు. ఉగాది పర్వదినాన సాహిత్య సౌరభాన్ని పంచిన ఈ కార్యక్రమం సాహిత్య వాతావరణాన్ని మరింత ఉత్సాహ భరితంగా మార్చింది. ఈ సందర్భంగా ఓదెల గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ రవీంద్ర చారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని ఓదెల గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉగాది వేడుకల నడుమ నిర్వహించిన ఈ కవి సమ్మేళనం సాహిత్య ప్రేమికులకు ఓ ప్రత్యేక అనుభూతిని మిగిల్చింది.

# డిక్లరేషన్ హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం...

### డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ విమర్శ...



గోదావరిఖని,//**మార్చి 20 (ఆకాంక్ష) :** తెలంగాణ శాసనసభలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువత సమస్యలను పూర్తిగా పక్కన పెట్టారని డీవైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్ ఏర్పాటు వంటి కీలక హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిందని గుర్తుచేశారు. అయితే గత బడ్జెట్‌లోనూ ఈ అంశాలు విస్మరణకు గురయ్యాయని, కనీసం ఈసారి అయినా నిరుద్యోగ యువతకు ఉపశమనం కలిగించే విధంగా నిధులు కేటాయిస్తారనే ఆశలు పెట్టుకున్నామని తెలిపారు. కానీ బడ్జెట్ ప్రసంగంలో నిరుద్యోగ భృతి అనే పదమే ప్రస్తావించక పోవడం యువతను మోసం చేసినట్టేనని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌పై కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వక పోవడం, షెడ్యూల్ అమలు చేయకపోవడం, ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం ద్వారా నిరుద్యోగులను ప్రభుత్వం దగా చేస్తోందని అన్నారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 67 వేల ఉద్యోగాల భర్తీని మాత్రమే చూపిస్తూ గొప్పలు చెప్పుకుంటోందని సురేష్, సాగర్ విమర్శించారు. అందులోనూ కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 12 వేల మాత్రమేనని, గత ప్రభుత్వ కాలంలో విడుదలైన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఇచ్చి మొత్తం 67,763 ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పడం పూర్తిగా అవాస్తవమని వారు పేర్కొన్నారు. స్వయం ఉపాధి రుణాల కోసం రాజీవ్ యువ వికాస్ పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అది కేవలం ఐదు లక్షల మందికి మాత్రమే వర్తింపజేస్తామని చెప్పడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల 27 వేల మంది నిరుద్యోగ యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, 2026 జూన్ 2న నిధులు మంజూరు చేస్తామని చెప్పి ఏడాది గడిచినా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ అదే రూ.6 వేల కోట్ల కేటాయింపులను బడ్జెట్‌లో చూపించినా, అమలు విషయంపై ఒక్క మాట కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని విమర్శించారు. కార్మిక ఉపాధి శాఖకు కేవలం రూ.998 కోట్లు మాత్రమే కేటాయించడం యువత అవసరాలకు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ రేటును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బడ్జెట్‌ను సవరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన స్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను పదే పదే ప్రస్తావిస్తూ కాలం గడిపేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తాము ఇచ్చిన హామీల అమలుపై మాత్రం దృష్టి పెట్టడం లేదని డీవైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్య భాగంగా ఉన్న యూత్ డిక్లరేషన్ హామీల ప్రస్తావన లేకుండానే బడ్జెట్ ప్రవేశపెట్టడం నిరుద్యోగ యువత ఆశలకు గట్టి దెబ్బ అని అన్నారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమై, అమలులో పూర్తిగా విఫలమవుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఛాంపియన్ పోటీలకు నలుగురు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక...



మంథని//**మార్చి 20 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించిన 100 రోజుల రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మంథని మండలానికి చెందిన నలుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి రీడింగ్ ఛాంపియన్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించి, వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి రీడింగ్ ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ రీడింగ్ కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు స్కూల్ కాంప్లెక్స్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిల వరకు రీడింగ్ ఛాంపియన్ పోటీలను చేపట్టారు. ఇందులో గ్రూప్-1 కింద 1, 2 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ విభాగాల్లో, గ్రూప్-2 కింద 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మంథని మండలంలోని జడ్పీహెచ్ఎస్ అరెంద, జడ్పీహెచ్ఎస్ (బాయ్స్) మంథని, జడ్పీహెచ్ఎస్ గుంజపడుగు, గవర్నమెంట్ హైస్కూల్ మంథని స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి గెలుపొందిన 16 మంది విద్యార్థులకు మండల విద్యాధికారి దాసరి లక్ష్మీ ఆధ్వర్యంలో మండలస్థాయి రీడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 1-2 తరగతుల తెలుగు విభాగంలో ఎంపీపీఎస్ చిన్న ఓదాల పాఠశాలకు చెందిన పి. సణవి, ఇంగ్లీష్ విభాగంలో ఎంపీపీఎస్ ఎగ్లాస్‌పూర్‌కు చెందిన జి. చైత్ర ఎంపికయ్యారు. 3 నుంచి 5 తరగతుల తెలుగు విభాగంలో ఎంపీపీఎస్ గర్ల్స్ మంథనికి చెందిన ఎస్. మోక్ష, ఇంగ్లీష్ విభాగంలో ఎంపీపీఎస్ ఎరుకలగూడెంకు చెందిన కె. నిత్విక్ జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ విజేతలకు మండల విద్యాధికారి దాసరి లక్ష్మీతో పాటు అరెంద స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈదులపల్లి నరసింహారావు, ప్రభుత్వ హైస్కూల్ మంథని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జె. సురేష్ కుమార్, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ మంథని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా తెలుగు విభాగంలో కేశవులు, ఇంగ్లీష్ విభాగంలో రవీందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్లు బోగే చంద్రశేఖర్, నారమల్ల లక్ష్మణ్, ఎర్రం రమేష్, కోట లక్ష్మణ్, లోకె రాజ్ పవన్, మద్ది రాము, అలాగే సీఆర్‌పీలు మల్లన్న, స్వప్న, రాధిక, సుప్రజ తదితరులు పాల్గొన్నారు. రీడింగ్ క్యాంపెయిన్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు మెరుగుపడటంతో పాటు పోటీ స్ఫూర్తి పెంపొందుతోందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా స్థాయి పోటీల్లోనూ మంథని విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

### జడ్చర్లలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన

# మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి...



జడ్చర్ల//**మార్చి 20 (ఆకాంక్ష) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరసోదరీమణులందరికీ మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ స్నేహం, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. నెల రోజులపాటు అత్యంత నిష్ఠతో, క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకునే ఈ పవిత్ర పండుగ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలను పెంపొందిస్తుందని డా.లక్ష్మారెడ్డి అన్నారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ అల్లాహ్ దీవెనలు లభించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో హిందూ, ముస్లింలు గంగా-జమునా తహజీబ్ స్ఫూర్తితో పరస్పర గౌరవాభిమానాలతో పండుగలను జరుపుకోవడం ఈ నేల గొప్పతనమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి, సమైక్యతకు, సోదరభావానికి ప్రతీకగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా పరస్పర ప్రేమ, శాంతి, సహనం, సహజీవన భావనలను మరింత బలోపేతం చేసుకుంటూ పండుగ స్ఫూర్తిని కొనసాగించాలని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

## రుద్రంగి మండలంలో చిరుతపులి సంచారం కలకలం...

రుద్రంగి//**మార్చి 20 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు సమాచారం వెలువడటంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అటవీ శాఖతో పాటు పోలీసు శాఖకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు, మండల పరిధిలో నిన్న రాత్రి చిరుతపులి ఒక కుక్కను వేటాడి చంపినట్లు తెలిసింది. ఈ సంఘటనతో గ్రామస్తులు అప్రమత్తమై, రాత్రివేళ బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రుద్రంగి ఎస్ఐ ప్రత్యేక ప్రకటన విడుదల చేసి మండల ప్రజలకు పలు జాగ్రత్త సూచనలు చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తెల్లవారు జామున ఒంటరిగా బయటకు వెళ్లవద్దని హెచ్చరించారు. చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా బయటకు పంపవద్దని, తల్లిదండ్రులు వారికి మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పశువులు, పెంపుడు జంతువులను రాత్రి వేళల్లో సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని, పాకలు, పొలాల వద్ద కాపలా ఉండే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. గ్రామ శివార్లు, పొలాలు, నిర్మానుష్య ప్రాంతాలకు తాత్కాలికంగా వెళ్లడాన్ని నివారించడం మంచిదని సూచించారు. ఒక వేళ చిరుతపులి ఎక్కడైనా కనిపించినా దాని అడుగుజాడలు గమనించినా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మకుండా, అధికార యంత్రాంగానికి సహకరిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రుద్రంగి మండలంలో చిరుతపులి సంచారం వార్తతో ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ, అటవీ శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు.

### ముస్లిం సోదర సోదరీమణులకు

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు...



నాగర్‌కర్నూల్//**మార్చి 20 (ఆకాంక్ష) :** ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు, భక్తి శ్రద్ధలతో ఆచరణలో నిలుస్తారని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, పరస్పర ప్రేమాభిమానాలకు ప్రతీక అని ఆయన అన్నారు. రాష్ట్రంలో అన్ని మతాల సంప్రదాయాలకు గౌరవం ఇవ్వడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని మర్రి జనార్ధన్ రెడ్డి ఆకాంక్షించారు.

## మహిళ మెడలోని పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగల అరెస్టు...

రాజన్న సిరిసిల్ల//**మార్చి 20 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయినగర్‌లో మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఘటనలో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రెండు బంగారు పుస్తెలు, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, మార్చి 17, 2026 రాత్రి సాయినగర్‌కు చెందిన మేర్గు లత తన ఇంటి గేటు బయటకు వచ్చిన సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్రస్ అడుగుతున్నట్లు నటించారు. ఆ వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును బలవంతంగా తెంపుకుని ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థల పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు, సాంకేతిక ఆధారాలను వినియోగించి నిందితులను సయ్యద్ మౌలాన, మంగురు ప్రకాష్ యాదవ్‌లుగా గుర్తించారు. నిందితులు సిరిసిల్లకు వస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు రడుగు చౌరస్తా వద్ద మాటువేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 4.4 గ్రాముల బరువున్న రెండు బంగారు పుస్తెలు, ఘటనలో వినియోగించిన ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ తెలిపారు. అరెస్టైన నిందితుల్లో మొదటి నిందితుడు సయ్యద్ మౌలాన (22), తండ్రి బడే సాబ్, జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తుర్కశినగర్ నివాసి. రెండో నిందితుడు మంగురు ప్రకాష్ యాదవ్ (19), తండ్రి ధర్మేందర్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వేదిరే గ్రామానికి చెందినవాడిగా పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. స్వీయ రక్షణార్థం ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాలు మరియు పట్టణాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్ 100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వేగవంతమైన దర్యాప్తుతో కేసును ఛేదించిన సిరిసిల్ల టౌన్ పోలీసులను స్థానికులు అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత...




మెదక్/**మార్చి 20 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా పాపన్నపేట శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ చౌక బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 224 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పాపన్నపేట శివారులో మెదక్ వైపు నుంచి బొడ్మట్‌పల్లి వైపు వెళ్తున్న ఓ వ్యాన్‌పై అనుమానం రావడంతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వ్యాన్‌లో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని అదుపులోకి తీసుకుని అందులో ఉన్న సుమారు 224 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం వారి ఫిర్యాదు మేరకు బియ్యం తరలింపులో పాల్గొన్న అశోక్‌తో పాటు వ్యాన్ డ్రైవర్ వెంకట్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. పీడీఎస్ చౌక బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, ఎక్కడైనా ఇలాంటి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని దుర్వినియోగం చేయడం సమాజ ప్రయోజనాలకు విరుద్ధమని, ఇటువంటి అక్రమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం...

### ఏబివిపి బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్...

### ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు నిరసనగా బడ్జెట్ పత్రాలు దహనం...



హైదరాబాద్//**మార్చి 20 (ఆకాంక్ష) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిజాం కళాశాలలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు నిరసనగా బడ్జెట్ పత్రాలను దహనం చేయడం జరిగింది. విద్యారంగానికి కేవలం 8.22% శాతం నిధులను మాత్రమే కేటాయించడం పట్ల బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు అంజన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అవసరాలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యావ్యవస్థ బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, దీక్షిత్, రాహుల్, నితిన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా

## ఎన్.వి.ఎస్.ప్రభాకర్ శుభాకాంక్షలు...



హైదరాబాద్//**మార్చి 20 (ఆకాంక్ష) :** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ప్రభాకర్, ఆయనను కలిసి శాలువా కప్పి కమలపువ్వుతో శుభాకాంక్షలు తెలిపారు. ఇలాగే ఆయురాగ్యలతో ఉంటూ నిండు నూరేల్లు జీవించాలని ఎన్.వి.ఎస్.ప్రభాకర్ ఆకాంక్షించారు.